పెన్ పవర్
తెలంగాణ రౌండప్



# 'కృష్ణో'త్సవం

## శ్రీశైలంలోకి 2 లక్షల క్యూసెక్కులు.. 107 టీఎంసీలకు చేరిన నిల్వ

### పెరుగుతున్న ప్రవాహాలతో చిగురిస్తున్న ఆశలు

### సాగునీటి విడుదల అవకాశాలపై నేడు రాష్ట్రస్థాయి ఇంజినీర్ల కమిటీ సమావేశం

**హైదరాబాద్ పెన్ పవర్:** రిజర్వాయర్లలోకి నీటి ప్రవాహాలు పెరుగుతూ రైతుల్లో ఆశలు చిగురింపజేస్తున్నాయి. ఈ నేపథ్యంలో వాస్తవ పరిస్థితిని అంచనా వేసి నిర్ణయం తీసుకోవడానికి నీటిపారుదలశాఖ సన్నద్ధమవుతోంది. ఇప్పటివరకు ఉన్న నిల్వలు, వస్తున్న ప్రవాహాలు, తాగునీటి అవసరాలను పరిగణనలోకి తీసుకొని ప్రస్తుత ఖరీఫ్, వచ్చే రబీకి సాగునీటి విడుదలకు ఉన్న అవకాశాలపై చర్చించడానికి సమీకృత నీటి ప్రణాళిక, యాజమాన్యం రాష్ట్రస్థాయి కమిటీ బుధవారం సమావేశం కానుంది. ఇంజినీర్ ఇన్ చీఫ్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో అన్ని ప్రాజెక్టుల చీఫ్ ఇంజినీర్లు పాల్గొననున్నారు. శ్రీశైలంలోకి రెండు లక్షల క్యూసెక్కుల వరద కొనసాగుతుండగా, శ్రీరామసాగర్‌లో కూడా ప్రవాహం పెరిగింది.

రాష్ట్రంలో ఈ రెండు ప్రాజెక్టుల మీద ఆధారపడే ఎక్కువ ఆయకట్టు ఉంది. శ్రీశైలం నిండి నాగార్జునసాగర్‌కు నీటి విడుదల ప్రారంభమైతే సాగర్ ఎడమకాలువ ఆయకట్టుతోపాటు, ఎం.ఆర్.ఆర్.పి, కల్వకుర్తి ప్రాజెక్టుల కింద సాగుకు అవకాశాలు మెరుగుపడతాయి. శ్రీరామసాగర్‌లోకి మరో 40 టీఎంసీలు వస్తే వానాకాలం ఆయకట్టు వరకు కొన్ని తడులు ఇవ్వడానికి వీలవుతుంది. లేదంటే తాగునీటి అవసరాలకు ఉంచుకొని ముందస్తు రబీలో కొంత సరఫరా చేసే అవకాశం ఉంది. ఎల్‌నినో కారణంగా పరిస్థితులు ఎలా ఉంటాయో అంచనా వేయలేని నేపథ్యంలో తాగునీటికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంది. వీటన్నిటిపై రాష్ట్రస్థాయి ఇంజినీర్ల కమిటీ చర్చించనుంది. గత ఏడాది వరి 24.74 లక్షల ఎకరాలు, ఆరు తడిపంటలు 15.19 లక్షల ఎకరాలు కలిపి 39.93 లక్షల ఎకరాలకు 381.5 టీఎంసీల నీటిని ప్రాజెక్టుల కింద వినియోగించారు.మంచి వర్షాలు పడి రిజర్వాయర్లు రెండుసార్లు నిండటంతో ఎలాంటి ఇబ్బంది రాలేదు. ఈసారి పరిస్థితి భిన్నంగా ఉంది. 15 లక్షల ఎకరాల్లో ఆరుతడి పంటలు, 19 లక్షల ఎకరాల్లో వరికి ప్రణాళిక చేయాలని మొదట భావించినా, ఎల్‌నినో నేపథ్యంలో నీటిపారుదలశాఖ ఆచితూచి వ్యవహరిస్తోంది. ఈ మేరకు సాగు చేయాలన్నా 320 టీఎంసీలు అవసరమని అంచనా. ప్రత్యామ్నాయ పంటలు వేయాలని

-5 లో

## తెలంగాణ లైఫ్ సైన్సెస్ రంగానికి కొత్త ఊపు

- పరిశోధన-పరిశ్రమల మధ్య వారధిగా ఇండస్ట్రీ-ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ
- ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్‌బాబు

-5 లో

# పెన్ పవర్ కథనంతో కదిలిన రెవెన్యూ యంత్రాంగం

### 'బౌరంపేట్ 472'లో.. రెవెన్యూ కూల్చివేతలు..


- 'పెన్ పవర్'లో వచ్చిన ప్రత్యేక కథనానికి సంబంధించిన దుండిగల్ తహాశీల్దార్..
- "ప్రభుత్వ భూములకు రక్షణేది..? కబ్జాదారులకు అడ్డేది..? శీర్షికతో వార్త..
- కబ్జాదారులకు చెంపపెట్టుగా.. తక్షణ చర్యలకు తహాశీల్దార్ రాజేశ్వర్ రెడ్డి ఆదేశం..
- 3 బేస్మెంట్‌లు డిమాలిషన్.. టిజిహెచ్‌బి భూమిలో లేఅవుట్..
- పేదలే లక్ష్యంగా నోటరీలతో ప్లాట్‌ల విక్రయాలు..
- పెన్ పవర్ కథనంపై దుండిగల్ తహాశీల్దార్‌కు ఆకుల సతీష్ ఫిర్యాదు..
- కబ్జాదారునిపై క్రిమినల్ కేసులు పెట్టాలని, ఆకుల సతీష్ డిమాండ్..
- బౌరంపేట్ సర్వే నెం.472 భూమిని టిజిహెచ్‌బి అధికారులు పరిశీలనకు సిద్ధం..
- త్వరలో హెచ్చరిక బోర్డులు.. ఫెన్సింగ్ ఏర్పాటుకు రంగం సిద్ధం..
- సర్వే నెం.472 ప్రభుత్వ భూమిలో ప్లాట్‌లు కొనుగోలు చేయొద్దని తహాశీల్దార్ విజ్ఞప్తి..




పెన్ పవర్ EXCLUSIVE ఎఫెక్ట్

హైదరాబాద్ మహానగరంలో అనతి కాలంలోనే కోటీశ్వరులు కావాలంటే, సులువైన మార్గం కబ్జాలేనని అక్రమార్కులు భావిస్తున్నారు.. సంబంధిత ప్రభుత్వ భూమి ఎవరికి కేటాయించారు..? అన్నది అవసరం లేదు, సులభంగా డబ్బు సంపాదనే లక్ష్యం.. మేడ్చల్ జిల్లా గండిమైసమ్మ-దుండిగల్ మండలం బౌరంపేట్ సర్వే నెం.472 ప్రభుత్వ భూమి మొత్తం 31.34 ఎకరాలు.. సంబంధిత భూమిలో 21 ఎకరాలు గతంలో దిల్ నిర్మాణ సంస్థకు కేటాయించారు.. ప్రస్తుతం టిజిహెచ్‌బి ఆధీనంలోకి వెళ్ళింది.. ఇదంతా బాగానే ఉన్నప్పటికీ..! సంబంధిత స్థలంపై కొందరు కబ్జాదారుల కన్ను పడింది.. అసైనీల నుండి కొనుగోలు చేసి, దర్జాగా లేఅవుట్ వేయడం తీవ్ర వివాదంగా మారింది..

దుండిగల్, పెన్ పవర్, ఆగష్టు 4:



-4లో

# ప్రధాని, ఆయన తల్లిపై అభ్యంతరకర పోస్టులు దారుణం

### దీనిపై హైదరాబాద్‌లో కేసు పెట్టినందుకు రాష్ట్ర నేతలపై రాహుల్ ఆగ్రహం

### మెటా ఇండియా హెడ్‌కు నోటీసులిచ్చిన డీసీపీని ప్రభుత్వం వేధిస్తోంది: కిషన్‌రెడ్డి

**హైదరాబాద్ పెన్ పవర్:** ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాంలో ప్రధాని మోదీ, ఆయన తల్లిపై అమానవీయంగా పోస్టులు పెట్టడం దారుణమైన విషయమని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇప్పుడు ప్రధానిపై పెట్టిన పోస్టులు రేపు అందరిపై పెడతారని, ఇలాంటి వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మంగళవారం ఆయన దిల్లీలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. 'అభ్యంతరకర పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని భాజపా నేత సాయికిరణ్‌గౌడ్ హైదరాబాద్ సైబర్ క్రైం

-5 లో






# ప్రతి గింజకూ లెక్క చెప్పాల్సిందే

### ధాన్యాన్ని దారి మళ్లిస్తే మిల్లుల బ్లాక్‌లిస్ట్, యజమానులపై క్రిమినల్ కేసులు

### సమీక్షలో మంత్రి ఉత్తమ్ ఆదేశాలు

**హైదరాబాద్ పెన్ పవర్:**బ్యాంకుల్లో అప్పులు తీసుకుని కొనుగోలు చేసిన వడ్లను సీఎంఆర్‌కు ఇస్తే కొందరు మిల్లర్లు ఆ నమ్మకాన్ని వమ్ము చేస్తూ అక్రమాలకు పాల్పడుతుండటంతో ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లుతోందని.. అలాంటివారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారుల్ని ఆదేశించారు. నిబంధనల్ని పదేపదే ఉల్లంఘించే మిల్లర్లపై క్రిమినల్ కేసులు పెట్టడంతోపాటు వారి రైస్‌మిల్లులను బ్లాక్‌లిస్టులో పెట్టాలని స్పష్టంచేశారు. రైతుల నుంచి వచ్చిన ధాన్యం లెక్కలపై రాష్ట్రవ్యాప్తంగా రైస్‌మిల్లుల్లో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు చేపట్టాలని.. ప్రతి గింజకూ లెక్కచెప్పాల్సిందేనన్నారు. సీఎంఆర్ (కస్టమ్ మిల్డ్ రైస్) బకాయిలపై మంత్రి ఉత్తమ్ అధ్యక్షతన మంగళవారం జరిగిన ఉన్నతస్థాయి సమీక్షలో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ(డైరెక్టర్ జనరల్) డీఎస్ చౌహాన్, పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్రతోపాటు ఆర్థిక, న్యాయశాఖలకు చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు. సీఎంఆర్ బకాయిదారులను ముందుగానే గుర్తించేందుకు 'ఎర్లీ వార్నింగ్ సిస్టమ్' ఏర్పాటుచేయాలని మంత్రి అన్నారు. "కొంతమంది మిల్లర్లు అనేక సంవత్సరాలుగా తీవ్రమైన అక్రమాలకు పాల్పడ్డారు. ధాన్యాన్ని అనధికారికంగా విక్రయించడం.. బియ్యాన్ని దారి మళ్లించడం.. తక్కువ పరిమాణంలో బియ్యం ఇవ్వడం.. ఆలస్యంగా సీఎంఆర్ అప్పగించడం.. నిల్వలను దాచిపెట్టడం.. వంటి అక్రమాల్ని గుర్తించాం. ఇలాంటివారిపై లోతైన విచారణ జరుపుతాం. మిల్లర్ల ఆలస్యం కారణంగా ప్రభుత్వమే అదనపు వడ్డీ భారం భరించాల్సి వస్తోంది. ప్రభుత్వ ఆస్తుల దారి మళ్లింపు తీవ్రమైన నేరంగా పరిగణిస్తున్నాం. కఠినంగా వ్యవహరిస్తాం. బకాయి పడ్డ మిల్లర్ల స్థిరాస్తులు, బ్యాంకు గ్యారంటీలు, ఇతర సెక్యూరిటీల్ని జప్తు చేస్తాం" అని మంత్రి ఉత్తమ్ స్పష్టంచేశారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
'ఐదు రోజులకు'
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

# పకడ్బందీగా పోలీస్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ

### ప్రత్యేక నిఘా పెట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

**హైదరాబాద్ పెన్ పవర్:** పోలీస్ ఉద్యోగాల భర్తీని పకడ్బందీగా నిర్వహించాలని హోం శాఖ ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. నియామక ప్రక్రియకు ఎలాగైనా భంగం కలిగించాలని కొన్ని రాజకీయ పార్టీలతోపాటు ఇతర శక్తులు ప్రయత్నిస్తున్నట్లు నిఘావర్గాలు ఆయన దృష్టికి తీసుకెళ్లిన నేపథ్యంలో... డీజీపీ సీవీ ఆనంద్, పోలీస్ ఉన్నతాధికారులతో సీఎం మంగళవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. 7,437 పోస్టుల భర్తీని అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రశ్నపత్రాల తయారీ, ముద్రణ, రవాణాతోపాటు అన్ని దశల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరీక్ష కేంద్రాల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నియామక పరీక్షల నిర్వహణపై సామాజిక, ఇతర మాధ్యమాల్లో ఎలాంటి దుష్ప్రచారం జరగకుండా నియంత్రించాలని సూచించారు. పోలీస్ ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేసే దళారులు, నకిలీ వెబ్‌సైట్లు, సోషల్‌మీడియా అకౌంట్లపై సైబర్‌క్రైమ్ విభాగంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని స్పష్టంచేశారు. సమావేశంలో సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, హోంశాఖ ముఖ్య కార్యదర్శి శిఖా గోయెల్, పోలీస్ నియామక మండలి ఛైర్మన్ వి.వి.శ్రీనివాసరావు, హైదరాబాద్ కమిషనర్ వి.సి.సజ్జనర్, ఇంటెలిజెన్స్ చీఫ్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



### నేడు దిల్లీలో కేంద్ర మంత్రులతో సీఎం భేటీ

రాష్ట్రంలో పలు సాగునీటి ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు, ఇతర అంశాలపై చర్చించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం రాత్రి దిల్లీకి వెళ్లారు. సీతారామ ఎత్తిపోతలు, పాలమూరు-రంగారెడ్డి, డిండి,

గౌరవెల్లి తదితర ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులపై కేంద్ర అటవీ, పర్యావరణశాఖ మంత్రి భూపేందర్ యాదవ్, కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో బుధవారం ఆయన భేటీ కానున్నారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కార్యదర్శి శ్రీధర్ తదితరులు కూడా సమావేశాల్లో పాల్గొననున్నారు. ఈ పర్యటనలో రేవంత్‌రెడ్డి పలువురు ఏఐసీసీ పెద్దలను కలిసే అవకాశాలున్నట్లు తెలిసింది.

# పెన్ పవర్ కథనంతో
# కదిలిన రెవెన్యూ యంత్రాంగం


పెన్ పవర్
ప్రభుత్వ భూమికి రక్షణేదీ..?
కబ్జాదారులకు అడ్డేదీ..?

మంగళవారం పెన్ పవర్ దినపత్రికలో వచ్చిన స్పెషల్ స్టోరీ..

## 'బౌరంపేట్ 472'లో.. రెవెన్యూ కూల్చివేతలు..




- 'పెన్ పవర్'లో వచ్చిన ప్రత్యేక కథనానికి సంబంధించిన దుండిగల్ తహశీల్దార్..
- "ప్రభుత్వ భూములకు రక్షణేది..? కబ్జాదారులకు అడ్డేది..? శీర్షికతో వార్త..
- కబ్జాదారులకు చెంపపెట్టుగా.. తక్షణ చర్యలకు తహశీల్దార్ రాజేశ్వర్ రెడ్డి ఆదేశం..
- 3 బేస్మెంట్‌లు డిమాలిషన్.. టిజిహెచ్‌బి భూమిలో లేఅవుట్..
- పేదలే లక్ష్యంగా నోటరీలతో ప్లాట్‌ల విక్రయాలు..
- పెన్ పవర్ కథనంపై దుండిగల్ తహశీల్దార్‌కు ఆకుల సతీష్ ఫిర్యాదు..
- కబ్జాదారునిపై క్రిమినల్ కేసులు పెట్టాలని, ఆకుల సతీష్ డిమాండ్..
- బౌరంపేట్ సర్వే నెం.472 భూమిని టిజిహెచ్‌బి అధికారులు పరిశీలనకు సిద్ధం..
- త్వరలో హెచ్చరిక బోర్డులు.. ఫెన్సింగ్ ఏర్పాటుకు రంగం సిద్ధం..
- సర్వే నెం.472 ప్రభుత్వ భూమిలో ప్లాట్‌లు కొనుగోలు చేయొద్దని తహశీల్దార్ విజ్ఞప్తి..


హైదరాబాద్ మహానగరంలో అనతి కాలంలోనే కోటీశ్వరులు కావాలంటే, సులువైన మార్గం కబ్జాలేనని అక్రమార్కులు భావిస్తున్నారు.. సంబంధిత ప్రభుత్వ భూమి ఎవరికి కేటాయించారు..? అన్నది అవసరం లేదు, సులభంగా డబ్బు సంపాదనే లక్ష్యం.. మేడ్చల్ జిల్లా గండిమైసమ్మ-దుండిగల్ మండలం బౌరంపేట్ సర్వే నెం.472 ప్రభుత్వ భూమి మొత్తం 31.34 ఎకరాలు.. సంబంధిత భూమిలో 21 ఎకరాలు గతంలో దిల్ నిర్మాణ సంస్థకు కేటాయించారు.. ప్రస్తుతం టిజిహెచ్‌బి ఆధీనంలోకి వెళ్ళింది.. ఇదంతా బాగానే ఉన్నప్పటికీ..! సంబంధిత స్థలంపై కొందరు కబ్జాదారుల కన్ను పడింది.. అసైనీల నుండి కొనుగోలు చేసి, దర్జాగా లేఅవుట్ వేయడం తీవ్ర వివాదంగా మారింది..

దుండిగల్, పెన్ పవర్, ఆగస్టు 4:


బౌరంపేట్ సర్వే నెం.472లో రెవెన్యూ కూల్చివేతలు..


సర్వే నెం.472 టిజిహెచ్‌బి స్థలంలో కబ్జాలు తొలగింపు..

బౌరంపేట్ సర్వే నెం.472లో కూల్చివేతలు... అక్రమ నిర్మాణాలపై ఎమ్మార్వో చర్యలు, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై 'ప్రభుత్వ భూములకు రక్షణేది..? కబ్జాదారులకు అడ్డేది..?' శీర్షికతో పెన్ పవర్ దినపత్రికలో ప్రచురించిన ప్రత్యేక కథనం ప్రభావంతో దుండిగల్ రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తమైంది.. బౌరంపేట్ సర్వే నంబర్ 472లో తెలంగాణ హౌసింగ్ బోర్డు (టీజీహెచ్‌బీ)కు కేటాయించిన ప్రభుత్వ భూమిలో సాగుతున్న అక్రమ నిర్మాణాలపై అధికారులు, మంగళవారం తక్షణ చర్యలు చేపట్టి మూడు బేస్‌మెంట్‌లను కూల్చివేశారు.. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా దుండిగల్ మండలం బౌరంపేట్ సర్వే నంబర్ 472లో మొత్తం 31.34 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా, అందులో సుమారు 21 ఎకరాలు హౌసింగ్ బోర్డుకు కేటాయించారు.. ఈ భూమిని కొందరు అక్రమంగా ఆక్రమించి వెంచర్‌గా అభివృద్ధి చేసి, నోటరీ పత్రాల ఆధారంగా అమాయక ప్రజలకు ప్లాట్లు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి..




## పెన్ పవర్ కథనంపై ఎమ్మార్వోకు ఫిర్యాదు..

ఈ వ్యవహారంపై సామాజిక కార్యకర్త ఆకుల సతీష్ దుండిగల్ ఎంఆర్ఓ రాజేశ్వర్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని కాపాడాలని, అక్రమార్కులపై, వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, శాశ్వత ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ప్రభుత్వ ఆస్తిని రక్షించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.. పెన్ పవర్ దినపత్రికలో వచ్చిన వార్తా కథనాలతో ఫిర్యాదును పరిశీలించిన వెంటనే దుండిగల్ ఎంఆర్ఓ రాజేశ్వర్ రెడ్డి స్పందించి ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన ఆ మూడు బేస్‌మెంట్‌లపై చర్యలకు ఆదేశించారు.. త్వరలో టీజీహెచ్‌బీ అధికారులతో కలిసి జాయింట్ సర్వే నిర్వహించి ప్రభుత్వ భూమి హద్దులను ఖరారు చేయడంతో పాటు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, శాశ్వత ఫెన్సింగ్ చేపడతామని ఆయన తెలిపారు. ఇదే భూమిలో 2024లో కూడా అక్రమ కబ్జా ప్రయత్నాలను రెవెన్యూ అధికారులు అడ్డుకొని నిర్మాణాలను తొలగించిన విషయం తెలిసిందే. అయినప్పటికీ ఫెన్సింగ్ లేకపోవడాన్ని ఆసరాగా చేసుకొని కబ్జాదారులు మళ్లీ వెంచర్లు ఏర్పాటు చేసి ప్లాట్ల విక్రయాలకు పాల్పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు..



## తహశీల్దార్ కీలక హెచ్చరిక..

బౌరంపేట్ సర్వే నంబర్ 472 ప్రభుత్వ భూమిలో ఎలాంటి ప్లాట్లనూ కొనుగోలు చేయవద్దని, కొనుగోలు చేస్తే భవిష్యత్తులో చట్టపరమైన ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని దుండిగల్ తహశీల్దార్ రాజేశ్వర్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.. ఫిర్యాదు అందిన వెంటనే స్పందించి అక్రమ నిర్మాణాల తొలగింపునకు చర్యలు చేపట్టిన దుండిగల్ ఎమ్మార్వో రాజేశ్వర్ రెడ్డికి ఆకుల సతీష్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ భూములను కాపాడే వరకు తమ పోరాటం కొనసాగుతుందని సతీష్ స్పష్టం చేశారు.. ఈ కూల్చివేతలు ఆర్ఐ రవికుమార్ పర్యవేక్షణలో, జిపిఓ ప్రకాశ్, విఆర్ఏలు జితేందర్, సల్మాన్ పాల్గొన్నారు.

## ఇల్లంతకుంట మండలం లో బీజేపీకి పార్టీ కి ఈటలకు భారీ షాక్..

# బీఆర్ఎస్‌లోకి ముగ్గురు సర్పంచ్‌లు

**హుజూరాబాద్: పెన్ పవర్:** ఇల్లంతకుంట మండలంలో బీజేపీకి భారీ షాక్ తగిలింది. ఇల్లంతకుంట మండలానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు బీఆర్ఎస్ పార్టీ వైపు అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్ లో నందినగర్ నివాసం లో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి గంగుల కమలాకర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో సిరిసేడు సర్పంచ్ కుమార్ -శ్యామల వంతడుపుల సర్పంచ్ రాజేష్ -మాధవి టేకుర్తి సర్పంచ్ శ్రీనివాస్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం సాధించిన అభివృద్ధి, సంక్షేమం ప్రజల మనసుల్లో ఇప్పటికీ చెక్కుచెదరలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. బీజేపీ కూడా ప్రజా సమస్యలను పట్టించుకోకుండా రాజకీయాలకే పరిమితమైందని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ పాలనలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందని, గ్రామస్థాయిలో ఆ రెండు పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ వైపు చూస్తున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో మరింత మంది నాయకులు, ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు. కేసీఆర్ గారు మళ్లీ తెలంగాణకు నాయకత్వం వహించాలని, బీఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావాలని ప్రజలు

కోరుకుంటున్నారని సర్పంచ్‌లు అన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రజల పక్షాన నిలుస్తున్నారని, ఆయన నాయకత్వంపై తమకు పూర్తి విశ్వాసం ఉందని తెలిపారు. హుజూ రాబాద్‌లో బీఆర్ఎస్ బలం రోజురోజుకూ పెరుగుతోందని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్, బీజేపీల నుంచి మరిన్ని చేరికలు ఉంటాయని పేర్కొన్నారుఈ కార్యక్రమం లో మాజీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ మాజీ వీఠా వెంకటేష్ పాల్గొన్నారు

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# తెలంగాణలో ఇంజనీరింగ్ విద్యార్థుల కరువు

**హైదరాబాద్, ఆగస్టు 4 పెన్ పవర్:**
తెలంగాణాలో ఇంజనీరింగ్ కళాశాలలు విద్యార్థుల వేటలో పడ్డాయి. కన్వీనర్ కోటా, మేనేజ్మెంట్ కోటా సీట్లు భర్తీ కాకపోవడంతో ఏమి చేయాలో తోచక తలపట్టుకుంటున్నాయి. ఇప్పటికే రెండు విడతలకౌన్సిలింగ్ అయిపోయింది. శుక్రవారం నుంచి మూడో విడత చివరి కౌన్సిలింగ్ జరుగుతుంది. ఇంకా సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తిచేసుకోని విద్యార్థులు వెంటనే స్లాట్ బుక్ చేసుకొని హెల్ప్ లైన్ కేంద్రాలకువెళ్లాలని యాజమాన్యాన్యాలు బతిమాలుతున్నాయి. అయినా సరే పూర్తి సీట్లు భర్తీ అయ్యే పరిస్థితి కనిపించడం లేదని యాజమాన్యాలు దిగులుపెట్టుకున్నాయి. తెలంగాణాలోని ప్రైవేటు ఇంజనీరింగ్‌కళాశాలల్లో కన్వీనర్ కోటాలో 22,972 సీట్లు మిగిలిపోయాయి. మేనేజ్మెంట్ కోటాకు కూడా భారీగా డిమాండ్ తగ్గినట్లు సమాచారం. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలాల్లో కన్వీనర్ కోటాలోమొత్తం 94,424 సీట్లు ఉండగా రెండు విడతలుగా జరిగిన కౌన్సిలింగ్ లో 71,452 సీట్లు భర్తీ అయ్యాయి. మిగిలిన సీట్లు భర్తీ కావడానికి ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాలు కొత్త దారులువెదుకుతున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఇంజనీరింగ్ కళాశాలల్లో సీట్ల భర్తీ విషయంలో కన్సలెంట్లు కీలక పాత్ర పోషిస్తుంటారన్నది బహిరంగ రహస్యం. జూనియర్ కాలేజీ నిర్వాహకులు, అక్కడ పనిచేసేలెక్చరర్ల ద్వారా విద్యార్థులను ఆకర్షిస్తుంటారు. అయితే కొన్ని పేరున్న ఇంజనీరింగ్ కళాశాలలు గత కొన్నేళ్లుగా వారిని దగ్గరకు రానివ్వడం లేదు. ఇప్పుడు పరిస్థితి తలకిందులు కావడంతో పెద్ద కాలేజీలుసైతం కన్సల్టెంట్ల వద్దకు పరుగులు తీస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. నిన్నా మొన్నటి దాకా యాజమాన్యం ఇచ్చింది తీసుకొన్న కన్సల్టెంట్ల పంట పండింది. ఇంజనీరింగ్ కళాశాలల్లో కన్వీనర్ కోటా, మేనేజ్మెంట్ కోటాలో ఐదు సీట్లు భర్తీ చేసిన వారికి రెండు సీట్లు ఉచితంగా ఆఫర్ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఎల్బీ నగర్, హయాత్ నగర్ ప్రాంతాల్లోని కాలేజీలు ఒక అడుగు ముందుకేసి ఒకటికీ ఒకటిఉచితం అంటూ ఊరిస్తున్నట్లు సమాచారం. బాచుపల్లి, నిజాం పేట్, ఘట్ కేసర్ ప్రాంతాల్లోని కాలేజీలు సైతం మేనేజ్మెంట్ కోటా భర్తీ చేయడానికి కన్సల్టెంట్ల చుట్టూ తిరుగుతున్నట్లు చెబుతున్నారు.

## నడి రోడ్డుపై వ్యక్తిపై హత్యాయత్నం

**హైదరాబాద్ పెన్ పవర్:** నడి రోడ్డు పై వ్యక్తిని దారుణంగా చంపే ప్రయత్నం చేసారు దుండగులు. సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సింగరేణి కాలనీలో ఘటన జరిగింది. హమేర్(35) అనే వ్యక్తిపై హత్యయత్నం చేసారు. హమేర్ పై గంజాయి బ్యాచ్ కత్తితో దాడి చేసిందని సమాచారం. స్థానికులు బాధితున్ని హాస్పిటల్ కు తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. హమేర్ పై గతంలో పలు చోరీ కేసులు నమోదు అయినట్లు సమాచారం. పాత కక్షలు, ఆర్థిక లావాదేవీలు కారణంగానే దాడి చేసినట్లు సమాచారం.

## స్టైపెండ్ పెంపే డిమాండ్..

## రాష్ట్రవ్యాప్తంగా ఆయుష్ వైద్యుల నిరవధిక సమ్మె

**హైదరాబాద్ పెన్ పవర్:** స్టైపెండ్ పెంపు డిమాండ్‌తో తెలంగాణలోని ప్రభుత్వ ఆయుష్ వైద్య కళాశాలలు, అనుబంధ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థులు మంగళవారం నుంచి నిరవధిక సమ్మె ప్రారంభించారు. హైదరాబాద్ రామంతపూర్‌లోని జేఎస్పీఎస్ ప్రభుత్వ హోమియోపతి మెడికల్ కాలేజీ మరియు ఆస్పత్రి వద్ద జేఏసీ ఆధ్వర్యంలో వైద్యులు నిరసన చేపట్టి, “వివక్ష వీడాలి.. స్టైపెండ్ పెంచాలి” అంటూ నినాదాలు చేశారు. తెలంగాణలో ఆయుష్ విద్యార్థులకు చెల్లిస్తున్న స్టైపెండ్ దేశంలోనే అత్యల్పమని, గత పదేళ్లుగా ఎలాంటి పెంపు లేదని జేఏసీ ఆరోపించింది. అల్లోపతి విద్యార్థులతో సమానంగా స్టైపెండ్ పెంచాలని, డిమాండ్లు నెరవేరే వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేసింది. వైద్యుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని రోగులు కోరారు. సమ్మె కొనసాగితే వైద్య సేవలకు అంతరాయం కలిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

# హైదరాబాద్‌లో భారీగా మసాలా పదార్థాల ఆహార కల్తీ గుట్టురట్టు...

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ లో హెచ్-ఫాస్ట్ జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారులు 13 సంస్థల్లో తనిఖీలు నిర్వహించి 25 వేల కిలోల మసాలా దినుసులను స్వాధీనం చేసుకున్నారు.
మసాలా దినుసుల్లో సింథటిక్ రంగులు, ఇండస్ట్రియల్ డైలు, టాల్కమ్ పౌడర్, రైస్ బ్రాన్ ఆయిల్ కలిపి రంగు, మెరుపు, బరువు పెంచినట్లు అధికారులు గుర్తించారు. ఇవి క్యాన్సర్‌తో పాటు తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు.
గత 140 రోజుల్లో హెచ్-ఫాస్ట్ 659 తనిఖీలు నిర్వహించి 202 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసింది. దాదాపు 2.46 లక్షల కిలోల అనుమానిత కల్తీ ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో మసాలా దినుసులు, అల్లం-వెల్లుల్లి పేస్ట్, మాంసం, పనీర్, పాల ఉత్పత్తులు, పండ్లు, ఊరగాయలు, టీ పొడి, తాగునీరు ఉన్నాయి.

## ఆలయ స్థల వివాదంపై రాజకీయాల్లోదు

## షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


**హైదరాబాద్ పెన్ పవర్:** బీరప్ప స్థల వివాదంపై రాజకీయాలతో వాస్తవాలు అన్ని పరిశీలించి అందరికి ఆమోదయోగ్యంగా ఉండేవిధంగా ఆలయాన్ని నిర్మించుకునేందుకు స్థల ఏర్పాటు జరుగుతుందని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ భరోసా ఇచ్చారు. ఫరూక్ నగర్ ప్రాంతానికి చెందిన పలువురు కురువ కులస్తులు, ఇతర గ్రామ ప్రజలు మంగళవారం షాద్ నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రత్యేకంగా కలుసుకున్నారు. సీఎస్కే వెంచర్ లో పురాతన బీరప్ప దేవాలయం స్థల వివాదాన్ని ఎమ్మెల్యేకు వివరించారు. సీఎస్కే యాజమాన్యం భూమి తీసుకున్న సమయంలో దానికి బదులుగా దేవాలయానికి భూమి ఇచ్చేందుకు ఒప్పుకున్నారని ఆ తర్వాత బీరప్ప దేవాలయం ఉన్న స్థలాన్ని ప్లాట్లుగా మార్చి గతంలోని విక్రయించారని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. కేవలం ఒక గుంట పొలం మాత్రమే అక్కడ ఉందని మిగతా స్థలం లేకపోవడంతో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయని ఎమ్మెల్యేకు కాంగ్రెస్ నాయకులు బీరప్ప, శ్రీశైలం శివ, నక్కలపల్లి మల్లేష్, మహేందర్, మాసి, శ్రీను, శివ, ఎల్లన్ తదితరులు వివరించారు. ప్రస్తుతం అక్కడ కొన్ని నిర్మాణాలను తొలగించడంతో వివాదం మొదలైందని ఎమ్మెల్యే దృష్టి తెచ్చారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వారితో మాట్లాడుతూ.. ఆలయాలు ఆత్మగౌరవ్వాలని వాటికి భంగం ఎవరు కలిగించవద్దని తెలిపారు అయితే దాని గురించి పూర్తిస్థాయిలో తనకు అవగాహన లేదని వాస్త విషయాలను పూర్తిగా పరిశీలించి అక్కడ స్థలం ఉంటే తప్పకుండా అది వచ్చేలా చూస్తానని భరోసా ఇచ్చారు. ఇలాంటి సమయాల్లో రాజకీయాలు చేయవద్దని రాజకీయాలు చేస్తే తాను రానని వాస్తవాలు ఇలా ఉంటే అలా న్యాయం చేద్దామని వారికి అభయం ఇచ్చారు.

# ‘కృష్ణో’త్సవం

-3 పేజి తరువాయి
ప్రభుత్వం, వ్యవసాయ, నీటిపారుదల శాఖలు ప్రచారం చేసినా అధిక శాతం రైతులు బావులు, బోర్ల కింద వరి నాట్లకే సిద్ధమైనట్లు తెలుస్తోంది. కృష్ణా బేసిన్‌లో ఎగువన కురుస్తున్న వర్షాలతో శ్రీశైలంలోకి భారీ వరద ప్రవాహం కొనసాగుతోంది. మంగళవారం సాయంత్రం 6 గంటలకు రెండు లక్షల క్యూసెక్కుల ప్రవాహం ఉండగా, బుధవారం ఇంకా పెరిగే అవకాశం ఉంది. ఆలమట్టి నుంచి 1.50 లక్షల క్యూసెక్కులు విడుదల చేయగా, నారాయణపుర్ నుంచి 1.48 లక్షల క్యూసెక్కులు వదిలారు. భీమా నుంచి వచ్చిన నీటితో కలిపి జూరాలకు 2.41 లక్షల క్యూసెక్కులు రాగా, 2.53 లక్షల క్యూసెక్కులు విడుదల చేశారు. జూరాల నుంచి నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్, జూరాల కుడి, ఎడమకాలువలతో సహా అన్ని కాలువలకు నీటిని విడుదల చేశారు. తుంగభద్రకు కూడా వరద ప్రవాహం పెరిగి 82 వేల క్యూసెక్కులకు చేరింది. ఈ ప్రాజెక్టులో నీటి నిల్వ 55 టీఎంసీలకు చేరింది. పూర్తిగా నిండటానికి మరో 50 టీఎంసీలు అవసరం. శ్రీశైలంలో బుధవారం సాయంత్రానికి నీటినిల్వ 107 టీఎంసీలకు చేరగా.. నిండటానికి మరో 108 టీఎంసీలు కావాలి. నాగార్జునసాగర్ నిండటానికి ఇంకా 170 టీఎంసీలు రావాల్సి ఉంది. 250 టీఎంసీల నిల్వ చేరితే హైదరాబాద్ తాగునీటి అవసరాలతోపాటు నాగార్జునసాగర్ ఎడమకాలువ, ఎం.ఆర్.ఆర్.పి, కల్వకుర్తి ఇలా అన్ని ప్రాజెక్టులకు నీటిని విడుదల చేయడానికి అవకాశం ఉంటుందని నీటిపారుదలశాఖ వర్గాల అంచనా. ప్రస్తుత ప్రవాహం కనీసం పది రోజులకు పైగా కొనసాగితేనే ఇది సాధ్యమవుతుంది.

**ఎస్సారెస్పీలోకి 22 వేల క్యూసెక్కులు**
శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి 22 వేల క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. మధ్యాహ్నం 28 వేల క్యూసెక్కులు వచ్చినా సాయంత్రానికి కొంత తగ్గింది. ఈ ప్రాజెక్టులో ప్రస్తుతం 35 టీఎంసీల నిల్వ ఉండగా, నిండటానికి మరో 45 టీఎంసీలు అవసరం. డెడ్ స్టోరేజీ పోను 20 టీఎంసీలు మాత్రమే అందుబాటులో ఉంటాయి. ఇవి తాగునీటి అవసరాలకు సరిపోతాయి. ఎగువన మహారాష్ట్రలో అన్ని ప్రాజెక్టులు నిండిన నేపథ్యంలో రానున్న రోజుల్లో వచ్చే ప్రవాహం కీలకం కానుంది. నిజాంసాగర్‌లో 10 టీఎంసీలు ఉండగా, 7 వేల క్యూసెక్కుల ప్రవాహం ఉంది. ఈ ప్రాజెక్టు ఆయకట్టుకు కొంత నీటిని ఇవ్వడానికి అవకాశం ఏర్పడింది. కడెం, ఎల్లంపల్లిలు పూర్తిస్థాయి నిల్వలతో ఉన్నాయి. ఎల్లంపల్లికి ప్రవాహం తగ్గి 5 వేల క్యూసెక్కులు రాగా, ఎత్తిపోతల ద్వారా మధ్యమానేరుకు 12 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. మధ్యమానేరులో 16 టీఎంసీలు ఉండగా, స్థానికంగా కురిసిన వర్షాలతో కలిపి 18,645 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. ఈ ప్రాజెక్టు నిండటానికి మరో 10 టీఎంసీలు అవసరం. ఎగువ మానేరుకు 5,666 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. మానేరుకు వరదతో అన్నారం బ్యారేజీకి 10 వేల క్యూసెక్కుల ప్రవాహం ఉంది. ప్రాణహితలో వరద ప్రవాహం తగ్గింది. మేడిగడ్డ బ్యారేజి వద్ద 1.74 లక్షల క్యూసెక్కుల ప్రవాహం ఉంది.

# తెలంగాణ లైఫ్ సైన్సెస్ రంగానికి కొత్త ఊపు



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రస్తుతం లైఫ్ సైన్సెస్ తయారీ కేంద్రంగా.. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు ప్రధాన గమ్యస్థానంగా తెలంగాణ ఎదుగుతున్నప్పటికీ.. విద్యాసంస్థల పరిశోధనలకు, పరిశ్రమల అవసరాలకు మధ్య అంతరం కొనసాగుతోందని ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ప్రభుత్వం, పరిశ్రమలు, బిట్స్ పిలానీ, ఆర్ఎంఐటీ యూనివర్సిటీ కలిసి పనిచేయడం ద్వారా.. ప్రపంచస్థాయి పరిశోధకులను తీర్చిదిద్దవచ్చని, తెలంగాణలో ఆవిష్కరణల ఆధారిత లైఫ్ సైన్సెస్ ఎకోసిస్టమ్‌ను మరింత బలోపేతం చేయవచ్చని ఆకాంక్షించారు. తెలంగాణ లైఫ్ సైన్సెస్, బిట్స్ పిలానీ, ఆస్ట్రేలియాకు చెందిన ఆర్ఎంఐటీ యూనివర్సిటీ సంయుక్తంగా తీసుకొచ్చిన ఇండస్ట్రీ-ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ అండ్ రీసెర్చ్ ప్రోగ్రామ్‌ను హైదరాబాద్‌లో మంగళవారం మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. “ఇప్పటివరకు ప్రపంచానికి సాఫ్ట్‌వేర్‌ను అందించడంలో, ప్రాణాలను కాపాడే ఔషధాల తయారీలో హైదరాబాద్ గుర్తింపు పొందింది. ఇకపై ఉత్పత్తుల రూపకల్పన, మేధోసంపత్తి సృష్టి, విప్లవాత్మక ఆవిష్కరణలకు కేంద్రంగా తీర్చిదిద్దాల్సిన అవసరముంది. ప్రస్తుతం పరిశోధనపై భారతదేశం చేస్తున్న పెట్టుబడులు చైనాతో పోలిస్తే నాలుగో వంతు... అమెరికాతో పోలిస్తే ఐదో వంతు కంటే తక్కువగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇండస్ట్రీ-ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ కార్యక్రమం ద్వారా పరిశ్రమలు, విద్యాసంస్థలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి హైదరాబాద్‌ను ప్రపంచ లైఫ్ సైన్సెస్ ఆర్అండ్‌డీ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. అంతర్జాతీయ స్థాయి విద్యా నైపుణ్యాన్ని పరిశ్రమల వాస్తవ సమస్యలతో మేళవించి, పరిశోధన ఫలితాలను నేరుగా అక్కడే అమలు చేయడంతో పాటు.. నైపుణ్యం కలిగిన పరిశోధకులను తయారు చేయనున్నారు” అని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఐటీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అలెక్ కామెరాన్, బిట్స్ పిలానీ గ్రూప్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వి.రామ్‌గోపాల్‌రావు, ప్రొఫెసర్ మోహన్ కృష్ణమూర్తి, తెలంగాణ లైఫ్ సైన్సెస్ సీఈవో సర్వేష్ సింగ్, ఐటీ శాఖ సలహాదారు సాయికృష్ణ, పలు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

**సెప్టెంబరు నుంచి అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు ‘టీ-ఫైబర్’**
సెప్టెంబరు 1 నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు ‘టీ-ఫైబర్’ ద్వారానే ఇంటర్నెట్ సేవలు అందించాలని ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధికారులను ఆదేశించారు. ఆ గడువు దాటిన తర్వాత ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంటర్నెట్ సేవల నిమిత్తం ప్రైవేట్ ఆపరేటర్లకు బిల్లులు చెల్లించొద్దని స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలో ‘టీ-ఫైబర్’పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. “టీ-ఫైబర్ నెట్‌వర్క్ వినియోగంతో ప్రభుత్వానికి ఏటా సుమారు రూ.300-రూ.400 కోట్ల వరకు ఆదా అయ్యే అవకాశముంది. గత ఆరు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా 4,487 ప్రభుత్వ కార్యాలయాలకు ‘టీ-ఫైబర్’ ద్వారా ఇంటర్నెట్ సేవలు అందేలా ఏర్పాట్లు చేశాం. ఫలితంగా ప్రభుత్వ ఖజానాకు రూ.13 కోట్లు ఆదా అయ్యింది. తెలంగాణ వైడ్ ఏరియా నెట్‌వర్క్(టీ-స్వాన్)ను నెల రోజుల్లోపు పూర్తిస్థాయిలో టీ-ఫైబర్‌కు బదిలీ చేయాలి. అలాగే ఇంటింటికీ ఇంటర్నెట్ అందించే ప్రక్రియను వేగవంతం చేయాలి” అని శ్రీధర్‌బాబు దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో సీఎస్ సంజయ్ జాజు, ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, టీ-ఫైబర్ ఎండీ పన్నీరు వేణుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని, ఆయన తల్లిపై అభ్యంతరకర పోస్టులు దారుణం

-3 పేజి తరువాయి
పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో భాగంగా పోస్టులు చేసిన వారితోపాటు మెటా సంస్థ ఇండియా హెడ్‌కూ పోలీసులు నోటీసులు ఇచ్చారు. మెటా సంస్థకు నోటీసులిచ్చినందుకు డీసీపీ అరవింద్‌బాబును రాష్ట్ర ప్రభుత్వం వేధింపులకు గురిచేస్తోంది. మెటాపై ఎలా కేసు పెడతారని దిల్లీ నుంచి రాహుల్‌గాంధీ రాష్ట్ర నేతలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో డీసీపీని బదిలీ చేశారని అంటున్నారు. ఎలాంటి తప్పు చేయకున్నా అధికారులను బదిలీ చేయడం రాష్ట్రంలో పరిపాటైంది.

కాంగ్రెస్‌ది రాష్ట్రానికొక వైఖరి...
కాంగ్రెస్ మద్దతిస్తున్న తమిళనాడు సీఎంను అక్కడి ప్రతిపక్షనేత ఏదో అంటే అరెస్టు చేశారు. మరి ప్రధాని, ఆయన తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చర్యలు తీసుకోవడం తప్పా? కాంగ్రెస్ రాష్ట్రానికొక వైఖరిని ప్రదర్శిస్తోంది. 2024లో తెలంగాణలో 27,230 సైబర్ క్రైమ్ కేసులు నమోదయ్యాయి. ప్రధాని మోదీ విషయంలో ఒక్క కేసు నమోదైతే రేవంత్‌రెడ్డికి బాధ కలుగుతోంది. తెలంగాణలో కార్యకర్త నుంచి సీఎం దాకా రాజకీయ నాయకులు వాడుతున్న భాష తీవ్ర అభ్యంతరకరంగా ఉంటోంది. ఇలా మాట్లాడే సోషల్ మీడియాకు చులకన అవుతున్నారు. ఫాంహౌస్ ఫైల్స్ పేరుతో కేసీఆర్ గతంలో ప్రతిపక్ష నేతలు, మీడియా ప్రతినిధులు, సినీ నటుల ఫోన్ ట్యాపింగ్ చేయడం చూశాం. నా ఫోన్ కేసీఆర్ ట్యాప్ చేశారని ఆయన కుమార్తె కవితే చెబుతున్నారు. సింగరేణికి రూ.54వేల కోట్లకుపైగా ఉన్న బకాయిలను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలి. కిషన్‌రెడ్డి సింగరేణికి అన్యాయం చేశారని కేటీఆర్ మాట్లాడుతున్నారు. ఎవరు అన్యాయం చేశారో చర్చకు సిద్ధమా? పీకేఓసీ-2 డిప్‌సైడ్ కోల్ బ్లాక్ సింగరేణికి దక్కడం సంతోషంగా ఉంది’ అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# కళాశాల ప్రహరీ గోడ నిర్మించాలని నిరసన



విద్యార్థులతో కలిసి నిరసన తెలియజేసిన ఎస్ఎఫ్ఐ నాయకులు

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు 4:** ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రహరి గోడ నిర్మించాలని కోరుతూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం మహబూబాబాద్ జిల్లా గార్ల మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట విద్యార్థులతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు.అనంతరం ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మధు మాట్లాడుతూ
మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రహరి గోడ లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,ప్రహరీ లేకపోవడం వల్ల కళాశాల ప్రాంగణంలోకి గేదెలు, కుక్కలు, పందులు క్లాస్ రూమ్ లోకి వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.గతంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రహరీ గోడ నిర్మాణం కోసం అనేక ఉద్యమాలు చేసిన స్థానిక అధికారులుపట్టించుకోవడంలేదనిఅన్నారు. రాత్రి వేళల్లో గుర్తుతెలియని వ్యక్తులు కళాశాల ప్రాంగణంలో మద్యం సేవించిన సందర్భాలు చాలా ఉన్నాయని, స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య స్పందించి, ప్రహరీ గోడను నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు కొడవండ్ల ఉదయ్ మండల నాయకులు కార్తీక్ ఆకాశ్ హరీష్ విద్యార్థులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్త ప్రచార జాతాలను విజయవంతం చేయాలి

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు 4:**
ఈనెల 6 నుండి 14 వరకు జరిగే దేశవ్యాప్త ప్రచార జాతాలను విజయవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కట్టే బోయిన శ్రీనివాస్ పిలుపునిచ్చారు.మహబూబాబాద్ జిల్లా గార్ల మండల కేంద్రంలోని స్థానిక సిపిఐ పార్టీ కార్యాలయంలో మంగళవారం ప్రచార యాత్ర వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు అనంతరం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 12 ఏళ్లుగా బిజెపి పాలనలో దేశం మన పెన్నడూ లేని విధంగా నిరుద్యోగిత పెరిగిందని నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్నింటి సామాన్యుడికి పెను భారమైందని, మోదీ కార్పొరేట్ అనుకూల విధానాల వలన దేశ సంపద కేవలం గుప్పెడు మంది చేతిలో కేంద్రీకృతమై, ప్రజల దగ్గర కేవలం కొద్ది సంపద మాత్రమే ఉండడంతో ఆర్థిక అసమానతలు తీవ్రంగా పెరిగిపోయి ఆకలి, దారిద్రం, నిరుద్యోగం, ధరల పెరుగుదల, రూపాయి విలువ పతనం కావడశీ, విదేశి మార్గ ద్రవ్య నిల్వలు పడిపోతున్నా ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగబోతున్నామని గొప్పలు చెప్పుకోవడం మోడీకి ఆనవాయితీగా మారిందని విమర్శించారు. లక్షలాది మంది రైతులు సుదీర్ఘ పోరాటాలు చేసిన కనీస మద్దతు ధరకు చట్టపరమైన హామీ కల్పించాలని డిమాండ్ పరిష్కారం కాలేదని, పేదలకు విద్యా, వైద్యం అందని ద్రాక్షగా మారిందని, సంఘటిత రంగ కార్మికులకు పని భద్రత లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు.పోరాటాలు, నిరసనలు, ఆందోళనలతోనే నియంతత్వ విధానాల అవలంబిస్తున్నా మోదీ ప్రభుత్వ మెడలు వంచడానికి ఈనెల 6 నుండి 14 వరకు జరిగే దేశవ్యాప్త ప్రచార జాతాలను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న,ధూపాటి జనార్ధన్, దారవత్ వీరన్న, మేదరమెట్ల గిరిప్రసాద్, భూక్య హరినాయక్,కోటేశ్వరి, లావుడ్య భీముడు,మాగం లోకేష్, ఇరుగు వెంకటేష్, కృష్ణయ్య,రాంబాబు, యశ్వంత్, తదితరులు పాల్గొన్నారు.55555555


ప్రచార యాత్ర వాల్ పోస్టర్ ను ఆవిష్కరిస్తున్న సిపిఐ నాయకులు

# గ్రామాల్లో ప్రభుత్వ వైద్య శిబిరాలు నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మండల కార్యదర్శి అలవాల సత్యవతి

**గార్ల పెన్ పవర్ ఆగస్టు 4:** వర్షాకాలం నేపథ్యంలో అన్ని గ్రామాలలో వైద్య అధికారులు వైద్య శిబిరశీలో ఉండి వైద్య శిబిరాలు నిర్వహించి, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవగాహన కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందునూరి.శ్రీనివాస్, మండల కార్యదర్శి అలవాల సత్యవతి లు డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా గార్ల మండల కేంద్రంలోని స్థానిక ఐతపు మంగపతి రావు భవనంలో బొబ్బ ఉపేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సిపిఎం మండల కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ ఇప్పటికే వర్షాలు ప్రారంభమై సీజనల్ వ్యాధులు ప్రభలుతున్నాయని, కొన్నిచోట్ల వైద్య శిబిరాలలో వైద్యాధికారి లేకుండా,వైద్య సిబ్బంది మాత్రమే పరీక్షలు నిర్వహించి తూ తూ మంత్రంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారన్నారు. మండల కేంద్రంలో ఉన్న అన్ని వసతి గృహాలలో విద్యార్థులకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి అన్ని రకాల మందులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.అన్ని గ్రామాలలో డ్రై నీజిల్లో చెత్త పేరుకుపోయి, దోమలు స్వైర విహారం చేసే అవకాశం ఉన్నాయని వెంటనే అన్ని గ్రామ పంచాయతీల్లో బ్లీచింగ్, పారిశుధ్య పనులు, డ్రైనేజీ పూడిక తీత పనులు, అన్ని వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ పనులు చేపట్టాలని పంచాయతీ అధికారులను డిమాండ్ చేశారు. సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా అన్ని గ్రామా లలో వైద్య, ఆరోగ్య శాఖల అధికారులు ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో మండల కమిటీ సభ్యులు గడ్డిపాటి రాజారావు, వీ పి వెంకటేశ్వర్లు, మల్లెల నాగమణి, చింత ఎల్లయ్య, సిహెచ్ బాబు, సిహెచ్ మౌనిక, కె.రామకృష్ణ, ఎ.రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

# పారిశ్రామికవేత్తల అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమం

## ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావుకు ఆహ్వానం



**ఎల్బీనగర్ పెన్ పవర్, ఆగస్టు 4:** సిద్ధిపేటలో ఆగస్టు 12న నిర్వహించనున్న పారిశ్రామికవేత్తల అవగాహన, ప్రత్యేక విక్రేతల అభివృద్ధి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాల్సిందిగా ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావును ట్రైబల్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (టిక్కి) ప్రతినిధులు కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన పారిశ్రామికవేత్తలు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రతినిధులు, ఔత్సాహిక వ్యాపారవేత్తలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, విక్రేతల అభివృద్ధి, ప్రభుత్వ కొనుగోలు విధానం, వ్యాపార అవకాశాలపై సమగ్ర అవగాహన కల్పించనున్నారు. అలాగే ప్రభుత్వ సంస్థలు, పారిశ్రామికవేత్తల మధ్య వ్యాపార సంబంధాలను బలోపేతం చేసి, కొత్త మార్కెట్ అవకాశాలు, వ్యాపార అనుసంధానాలను విస్తరించే దిశగా ఈ కార్యక్రమం దోహదపడనుంది. సిద్ధిపేట ప్రాంత పారిశ్రామికవేత్తల అభివృద్ధికి ఈ కార్యక్రమం ఒక ముఖ్యమైన వేదికగా నిలుస్తుందని నిర్వాహకులు తెలిపారు.

# విశ్వబ్రాహ్మణ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా రావూరి ప్రశాంత్ ఎన్నిక


రావూరి ప్రశాంత్

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు 4:**
మహబూబాబాద్: తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ జర్నలిస్ట్ అసోసియేషన్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా రావూరి ప్రశాంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలో మాజీ అధ్యక్షుడు గుండోజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో సంఘం అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించిన అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.ఈ ఎన్నికల్లో దూదికట్ల రవీంద్రాచారి కార్యదర్శిగా, దేవరకొండ చంద్రభాను కోశాధికారిగా ఎన్నికయ్యారు. గుండోజు శ్రీనివాస్ గౌరవ అధ్యక్షుడిగా కొనసాగనున్నారు. ఉపాధ్యక్షులుగా దూదికట్ల రామాచారి, సిరికొండ విక్రం, సహాయ కార్యదర్శులుగా పోతుగంటి సతీష్, వెలగలేటి కిరణ్, ధరసోజు బాలకృష్ణ ఎన్నికయ్యారు.ముఖ్య సలహాదారులుగా గుండోజు దేవేందర్, వీరేంటి ముకేశ్, శ్రీపాద శ్రీనివాసచారి, బాణాల భిక్షపతి, గుండోజు సుబ్రహ్మణ్యం ఎన్నికయ్యారు. సభ్యులుగా చామర్తి వినయ్, కట్ట మహేంద్రచారి ఎంపికయ్యారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రావూరి ప్ర శాంత్ మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ జర్నలి స్టుల అభివృద్ధి, వారి హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. జర్నలి స్టులు అభివృద్ధి చెందితేనే సమాజంలోని సమస్యల పరిష్కారానికి మరింతగా దోహదపడగలరని అన్నారు. ఈ బాధ్యత తనకు అప్పగించినందుకు ఆనందంగా ఉందని, సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.నూతన కమిటీకి జిల్లా వ్యాప్తంగా పలు రాజకీయ పార్టీలు, జర్నలిస్ట్ సంఘాలు, పురప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.

# రైతు సంఘం మండల అధ్యక్ష,కార్యదర్శులుగా ఉపేందర్ రెడ్డి, రాజారావు లు ఎన్నిక


రాజారావు, ఉపేందర్ రెడ్డి

**గార్ల పెన్ పవర్ ఆగస్టు 4:** తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులుగా బొబ్బ ఉపేందర్ రెడ్డి, గడ్డిపాటి రాజారావులను గార్లలో జరిగిన 9వమండల మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి శెట్టి వెంకన్న తెలిపారు. వీరితోపాటు ఉపాధ్యక్షులుగా గుండెటి వీరభద్రం,దారావత్ బుజ్జి, సహాయ కార్యదర్శి లు గా చింత ఎల్లయ్య, చింత బాబు లతో పాటు కమిటీ సభ్యులుగా బడిశా లక్ష్మి,కందునూరి మహేశ్వరావు,గుండా వెంకటరెడ్డి, వై. రామారావు,వి. వీరభద్రం,బి. శ్రీను,పి. బుజ్జి లను ఏకగ్రీవశీగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ మహాసభలలో అన్ని రకాల పంటలకు స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం చట్టబద్ధమైన కనీస మద్దతు ధర కల్పించాలని, రైతులకు ప్రకటించిన సమగ్ర రుణమాఫీని వెంటనే అమలు చేసి,చిన్న, సన్నకారు రైతులకు ఎరువులు, పురుగు మందులు ఉచితంగా లేదా సబ్సిడీపై సరఫరా చేయాలని, మండలాని కి చుక్క నీరు అందించకుండా నిర్మాణం చేపడుతున్న మున్నేరు-పాలేరు లింక్ కెనాల్ నిర్మాణ జీవో ను వెంటనే రద్దు చేయాలని తదితర తీర్మానాలు చేశారు.

# తల్లి పాలే బిడ్డకు శ్రేయస్కరం


మాట్లాడుతున్న జిల్లా సంక్షేమ అధికారి కే శిరీష

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు 4:** నవజాత శిశువులకు తల్లి పాలు అమృత తుల్య మైనవని,పిల్లలకు తల్లి పాలు ఇవ్వకుంటే భవిష్యత్తులో పలు రకాల అనారోగ్య సమస్యలు ఉత్పన్నం అయ్యే అవకాశం ఉందని తల్లి పాలే బిడ్డ కు శ్రేయస్కరం అని జిల్లా సంక్షేమ అధికారి కే శిరీష అన్నారు. మహబూబాబాద్ జిల్లా గార్ల మండల పరిధిలోని బాలాజీ తండా అంగన్ వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి ప్రసాదించిన అత్యుత్తమమైన పౌష్టికాహారం తల్లి పాల నుండే లభిస్తుందని, తల్లి పాలు ఇవ్వడం వలన అటు పిల్లలకు ఇటు తల్లి కి ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. పిల్లలకు రోగనిరోధక శక్తి లభించాలంటే తల్లి పాలు పట్టించాలని, తల్లి పాల అవశ్యకత ను ముర్రుపాల ప్రాముఖ్యతను బాలింత లు, గర్భిణులకు తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బట్టు అనిత ఉప సర్పంచ్ బాలు సిడిపిఓ లక్ష్మి కార్యదర్శి ప్రశాంతి సూపర్వైజర్ సంపూర్ణ అంగన్వాడి టీచర్లు గర్భిణీలు బాలింతలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# శీనన్న ఆత్మీయ భరోసా.. ఆపదలో అభయహస్తం!


చెక్కుల అందజేస్తున్న నేతలు

**ఖమ్మం పెన్ పవర్ ఆగస్టు 4** ఇటీవల కుటుంబ సభ్యులను కోల్పోయి తీరని శోకంలో ఉన్న 45 నిరుపేద కుటుంబాలకు శీనన్న ఆత్మీయ భరోసా కొండంత అండగా నిలిచింది. ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డులకు చెందిన బాధిత కుటుంబాలకు పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఒక్కో కుటుంబానికి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.4,50,000 ఆర్థిక సాయాన్ని మంగళవారం కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తరఫున బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కష్టకాలంలో తమను ఆర్థికంగా ఆదుకున్న మంత్రి పొంగులేటికి, పీఎస్ఆర్ ట్రస్ట్‌కు లబ్ధిదారులు ధన్యవాదాలు తెలిపారు.

# విరాట్ నగర్ లో వరద కాలువను పరిశీలించిన హైడ్రా రంగనాథ్

**హైదరాబాద్ పెన్ పవర్:** షేక్పేటలోని హకీంషా విరాట్నగర్లో చెత్త పేరుకుపోయిన వరద కాలువను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సోమవారం సాయంత్రం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పెద్దమొత్తంలో వ్యర్థాలు పేరుకుపోవడానికి గల కారణాలను అక్కడ స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ విషయమై సోమవారం మీడియాలో వచ్చిన కథనంతో పాటు.. స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో హైడ్రా కమిషనర్ నేరుగా నాలాను పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు. పై నుంచి పెద్దమొత్తంలో చెత్త కొట్టుకు రావడంతో పాటు.. చెత్తను ఇష్టానుసారం కాలువలో పడేయడంతో ఈ ఇబ్బంది ఏర్పడుతోందని హైడ్రా ఆర్ ఎఫ్ వో శ్రీ జయప్రకాష్ గారు, ఎస్ ఎఫ్ వో శ్రీ చరణ్గారు హైడ్రా కమిషనర్కు తెలిపారు. షేక్పేట ఓయూ కాలనీ, మారుతినగర్, వివేకానందనగర్, అంబేద్కర్ నగర్, ఎంజీ నగర్, హకీంషా విరాట్నగర్, బృందావన్ కాలనీ వరకు వరద కాలువ పొడుగునా సీసీటీవీ కెమేరాలను ఏర్పాటు చేసి నిఘా ఉంచాలని అధికారులకు హైడ్రా కమిషనర్ సూచించారు. చెత్త వేసిన వారిపై చర్యలు తీసుకోడానికి కూడా వెనుకాడవద్దన్నారు. స్థానికులతో కూడా మాట్లాడి చెత్త వేయకుండా ఇక్కడ కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. వరద కాలువలోకి జేసీబీలను దించి రెండు మూడు రోజుల్లో మొత్తం చెత్తను తొలగించాలని హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు.

# జూరాల ప్రాజెక్టు కు కొనసాగుతున్న భారీ వరద

**మహబూబ్ నగర్: పెన్ పవర్:** భారీ వర్షాల నేపథ్యంలో జూరాల ప్రాజెక్టుకు వరద పోటెత్తింది. దాంతో అధికారులు 27 గేట్లు ఎత్తివేసారు. ఇన్ ఫ్లో: 205000 క్యూసెక్కులు, అవుట్ ఫ్లో: 2,14,338 క్యూసెక్కులు, ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318.516. మీటర్లు, ప్రస్తుత నీటిమట్టం..317.490 మీటర్లు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 9.657 టీఎంసీలు.ప్రస్తుత నీటి సామర్థ్యం: 7.627 టీఎంసీలు. ఎగువ,దిగువ జూరాల జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్తు ఉత్పత్తి కొనసాగుతోంది.

# మల్లన్నకు అంత ఈజీ కాదా



**వరంగల్, ఆగస్టు 4, పెన్ పవర్:** చింతపండు నవీన్ కుమార్ అలియాస్ తీన్మార్ మల్లన్న ఇప్పుడు తన పొలిటికల్ కెరీర్లో మరో అత్యంత కీలకమైన సవాలుకు సిద్ధమవుతున్నారు. పల్లా రాజేశ్వర్ రెడ్డి రాజీనామాతో ఖాళీ అయినవరంగల్–ఖమ్మం–నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి జరిగిన ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించిన ఆయన, ప్రస్తుతం ఆ పార్టీతో తెగదెంపలు చేసుకుని సొంత రాజకీయంమొదలుపెట్టారు. 2027 మార్చితో ముగియనున్న తన పదవీకాలం ముగిసేలోపు, మళ్లీ అదే స్థానం నుంచి సొంత వేదిక ద్వారా గెలవాలనే లక్ష్యంతో సుదీర్ఘ పాదయాత్రకు రూపకల్పనచేస్తున్నారు.గతానికి -- ఇప్పటికీ మల్లన్న పొలిటికల్ ఇమేజ్లో చాలా స్పష్టమైన మార్పు వచ్చింది. ఒకప్పుడు తీన్మార్ మల్లన్న అంటే డిజిటల్ మీడియా ద్వారా ప్రభుత్వాలను, అక్రమాలను ప్రశ్నించే

హార్డ్కోర్ వాయిస్గా యూత్లో, ముఖ్యంగా నిరుద్యోగులు, పట్టభద్రుల్లో విశేషమైన ఆదరణ ఉండేది. ఆ ప్లాట్ఫామ్ తెచ్చిపెట్టిన క్రేజ్తోనే ఆయన స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసినప్పుడే లక్షలాది ఓట్లు సాధించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఆ తదనంతరం కాంగ్రెస్లో చేరి బిఆర్ఎస్, బిజెపిలను తట్టుకుని ఎమ్మెల్సీ పీఠాన్ని అధిరోహించగలిగారు.కానీ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా గెలిచిన తర్వాత ఆయన ఎంచుకున్నరాజకీయ దారి ఆయన పునాదులనే కదిలించిందనే అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. బీసీ ఐక్యత పేరుతో కొన్ని వర్గాలను ఆకట్టుకోవడానికి ప్రయత్నిస్తూనే.. ఇతర కులాలను, సమాజంలోని కొన్ని విభాగాలను తీవ్రంగా విమర్శిస్తూ చేసిన వ్యాఖ్యలు ఆయనకున్న న్యూట్రల్ , ఎడ్యుకేటెడ్ ఓటర్ బేస్ను తీవ్రంగా దెబ్బతీశాయి. విద్యావంతులు, గ్రాడ్యుయేట్లు ఓటేసే ఎమ్మెల్సీ నియోజకవర్గంలో కులగణనలు, వ్యక్తిగత దూషణల కంటే ఉద్యోగ ఉపాధి అవకాశాలు, శాసనమండలిలో వారి గళాన్ని వినిపించే వైఖరికే ప్రాధాన్యం ఇస్తారు. ఈ క్రమంలో మల్లన్న తన పాత ఇమేజ్ను పోగొట్టుకుని, దారి తప్పిన రాజకీయ ―ాయకుడిగా మిగిలిపోయారనే అభిప్రాయం సోషల్ మీడియా వేదికల్లో బాహాటంగానే కనిపిస్తోంది.రాబోయే ఎన్నికల్లో ఆయనకు కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలం, ఓటు బ్యాంకు అండగా ఉండవు. అటు బిఆర్ఎస్, ఇటు బిజెపిలు ఈ విస్తృత నియోజకవర్గంపై పట్టు సాధించేందుకు క్షేత్రస్థాయి నుంచి పక్కా వ్యూహాలు అమలు చేస్తున్నాయి. కాంగ్రెస్ వైపు నుంచి అధికారిక అభ్యర్థి బరిలో ఉంటారు. ఇలాంటి త్రిముఖ లేదా చతుర్ముఖ పోరులో, కాంగ్రెస్ ఓటు బ్యాంక్ లేకుండా, కేవలం సొంత ఇమేజ్తో బరిలోకి దిగడం మల్లన్నకు పెద్ద సాహసమే. అందుకే పాదయాత్ర ద్వారా మళ్లీ జనం లోకి వెళ్లి కోల్పోయిన నమ్మకాన్ని పునరుద్ధరించుకోవాలని ఆయన భావిస్తున్నారు.పాదయాత్రలు చేయడం తేలికే అయినా.. పట్టభద్రుల మైండ్ సెట్ను మార్చడం మల్లన్నకు అంత సులభం కాకపోవచ్చు. ఒకవేళ పాదయాత్ర చేసినా కూడా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆశించినస్థాయిలో ఓట్లు సాధించలేకపోతే, గత కొన్నేళ్లుగా ఆయన చుట్టూ ఉన్న పొలిటికల్ హడావుడి, బిల్డప్ అంతా ఒక ప్రసహనంలా మారే ప్రమాదం ఉంది. తన పాత ఇమేజ్ను తిరిగి తెచ్చుకుని, విద్యావంతులనుమెప్పించే సరైన అజెండాతో వస్తే తప్ప.. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల పోరు మల్లన్నకు ఆశాజనకంగా ఉండే అవకాశం కనిపించడం లేదు.

## మండలి ఎన్నికల సంగ్రామం షురూ....

**హైదరాబాద్, ఆగస్టు 4 పెన్ పవర్:** :తెలంగాణ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల హడావుడి పెరుగుతోంది. అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ , భారతీయ జనతా పార్టీలు ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఢిల్లీ వేదికగా నిర్వహించిన సమావేశంలో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో పారదర్శకత కోసం ప్రతి స్థానానికి ముగ్గురు బలమైన అభ్యర్థులతో కూడిన ప్యానెల్ జాబితాను తయారు చేసిసమర్పించాలని జిల్లా ఇన్ఛార్జ్ మంత్రులను ఆదేశించింది. వరంగల్ – ఖమ్మం – నల్గొండ పట్టభద్రుల స్థానం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న తీన్మార్ మల్లన్న , మహబూబ్నగర్ – రంగారెడ్డి – హైదరాబాద్ పట్టభద్రుల స్థానం నుంచి బిఆర్ఎస్ ప్రతినిధిగా ఎన్నికైన సురభి వాణీదేవిల పదవీకాలం 29 మార్చి 2027లి నాటితో ముగియనుంది. పల్లా రాజేశ్వర్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలవడంతో ఖాళీ అయిన వరంగల్–ఖమ్మం–నల్గొండ స్థానానికి 2024 జూన్ ఉపఎన్నికలో నెగ్గిన తీన్మార్ మల్లన్న గడువుతో పాటు, 2021లో హైదరాబాద్ గ్రాడ్యుయేట్ స్థానం నుంచి గెలిచిన వాణీదేవిల ఆరేళ్ల గడువు ఒకే తేదీతో ముగుస్తుండటంతో.. నిబంధనల ప్రకారం మార్చి 2027 లోగా ఎన్నికలు జరగనున్నాయి.గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదు ప్రక్రియ సాధారణ ఎన్నికల కంటే భిన్నంగా, చాలా సంక్లిష్టంగా, దీర్ఘకాలికంగా సాగుతుంది. సాధారణ అసెంబ్లీ లేదా లోక్సభ ఓటర్ల జాబితా లాగా ఇది పాత జాబితా కొనసాగింపు కాకుండా, ప్రతి ఎన్నికకూ కొత్తగా నిబంధనల ప్రకారం సున్నా నుంచి ఓటర్లను

నమోదు చేయాల్సి ఉంటుంది . నోటిఫికేషన్ లేదా పోలింగ్కు దాదాపు 4 నుంచి 5 నెలల ముందే ఈ ప్రక్రియ ప్రారంభమవుతుంది. త్వరలో ఓటర్ల జాబితా రూపకల్పన ప్రారంభించనున్నారు. అప్పటికే అభ్యర్థుల్ని ప్రకటిస్తే వారే ఓటర్ల నమోదు బాధ్యత తీసుకుంటారు.సాధారణ శాసనసభ లేదా లోక్సభ ఎన్నికలతో పోలిస్తే, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు సమాజంలోని విద్యావంతులు, ఉద్యోగులు,

ఉపాధ్యాయులు , నిరుద్యోగుల రాజకీయ ఓటింగ్ ధోరణికి అద్దం పడతాయి. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం చేపట్టిన విద్యా, ఉద్యోగ, యువజన విధానాలపై పట్టభద్రుల అభిప్రాయం ఎలా ఉందో తెలుసుకోవడానికి ఇది ఒక కొలమానంగా మారనుంది. ఈ స్థానం పరిధిలో అనేక మంది యువత, గ్రూప్స్ అభ్యర్థులు ఓటర్లుగా ఉండటంతో రాజకీయ పార్టీలన్నీ రాబోయే ఎన్నికల్లో వీరి ప్రభావం ఎంతవరకూఉంటుందో అంచనా వేస్తున్నాయి. సమర్థవంతమైన, ప్రజల్లో పట్టున్న విద్యావంతులనే అభ్యర్థులుగా బరిలోకి దించాలన్న కాంగ్రెస్ హైకమాండ్ ఆదేశాలతో సమర్థమైన యువ నేతల్ని అభ్యర్థులు ఎంపిక చేసే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందని చూపించాలనుకునే బీఆర్ఎస్, బీజేపీ కూడా శక్తివంచన లేకుండా ప్రయత్నించనున్నాయి.

# అక్కడి డ్రైనేజీ నీరంతా ఆ సెల్లార్ లోకే

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని శుభోదయ కాలనీ లో సిల్వర్ ఓక్స్ అపార్ట్మెంట్ లోకి చుట్టుపక్కల ఉండే డ్రైనేజీ నీరు చేరిన నరకయాతన అనుభవిస్తున్నారు. గత మూడు రోజుల నుండి చుట్టుపక్కల ఉండే భూగర్భ డ్రైనేజీ నీరు అంతా తమ అపార్ట్మెంట్ లోకి చేరి మూడు రోజుల నుంచి కరెంటు, నీళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. గత 20 రోజులుగా ఈ సమస్య ఉన్న తమను పట్టించుకునే నాథుడు అయ్యారని అన్నారు. ఎల్లమ్మ బండ తులసివనం వెళ్లే మార్గం లో నూతన రోడ్డు నిర్మాణం చేయగా కనీసం అవగాహన లేకుండా వేయడంతో చెరువు వైపు వెళ్లాల్సిన నీరు డ్రైనేజీ మ్యాన్ హోల్ పూర్తిగా మూసివేయడంతో నీరు అంతా వెనకకు చేరి అపార్ట్మెంట్ లోకి వస్తుందని అన్నారు. అధికారులు వస్తున్నారు చూస్తున్నారే తప్ప సమస్య పరిష్కారం కావడం లేదుని అన్నారు. ఇప్పటికే అపార్ట్మెంట్లో ఉన్న అందరూ ఖాళీ చేసి వెళ్లారని వారు వెల్లడించారు

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన అంగన్వాడీ టీచర్లతో ఎస్ఐ దురుసు ప్రవర్తన

# ఎస్పీని ఆశ్రయించిన బాధితులు

**మహబూబాబాద్ పెన్ పవర్:** తమను వేధించిన వ్యక్తిపై ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన అంగన్వాడీ టీచర్లతో ఎస్ఐ దురుసు ప్రవర్తన వివాదస్పదమయింది. ఎస్ఐ ప్రవర్తనతో మనస్తాపం చెందిన అంగన్ వాడీ టీచర్ స్పృహ కోల్పోయి కింద

పడిపోయింది. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం దొనకొండ గ్రామంలో విధులు నిర్వహిస్తున్న సమయంలో తమను వేధించిన వ్యక్తిపై ఫిర్యాదు చేసేందుకు అంగన్వాడీ టీచర్ ఆవుల మంజుల, హెల్పర్ వెంకటలక్ష్మి పోలీస్ స్టేషన్కు వెళ్లారు. ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన ఇద్దరినీ, మహిళలని కూడా చూడకుండా దంతాలపల్లి ఎస్ఐ రవికుమార్ బూతులు తిడుతూ అవమానపరిచాడని మహిళలు ఆరోపించారు.

తన ఛాంబర్లోకి పిలిచి ఎస్ఐ తమను, తమ భర్తలను అసభ్య పదజాలంతో దూషించాడని, తొక్కి చంపుతామని బెదిరించాడని బాధితులు ఎస్పీకి ఫిర్యాదు చేసారు.

ఎస్ఐ ప్రవర్తనతో తీవ్ర ఆవేదనకు గురై స్పృహ కోల్పోయిన మంజులను చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు.తమను అవమానించిన ఎస్ఐను సస్పెండ్ చేయకపోతే మాకు ఆత్మహత్యలే శరణ్యమని, తొర్రూరు సీఐ గణేష్కు కుడా బాధితులు పిటిషన్ ఇచ్చారు.

మేము బాత్రూమ్కు వెళ్తున్న వీడియోలు తీసి వేధిస్తున్నాడు. నరేష్ అనే వ్యక్తి గత మూడేళ్లుగా మేము స్కూల్లో పని చేస్తున్న సమయంలో

మా పర్సనల్ వీడియోలు, బాత్రూమ్కు వెళ్లే వీడియోలు తీసి వేధిస్తున్నాడని దంతాలపల్లి ఎస్ఐ రవికుమార్కు ఈ నెల 1వ తేదీన ఫిర్యాదు చేశామని అన్నారు.

ఎసస్ఐ మాకు న్యాయం చేస్తానని నమ్మించి, మమ్మల్ని పోలీస్ స్టేషన్కు పిలిపించి, మేము ఫిర్యాదు చేసిన వ్యక్తి ముందే మమ్మల్ని ఘోరంగా దూషిస్తూ అవమానపరిచాడని బాధతులు వాపోయారు.

# కల్వకుంట్ల ఫ్యామిలిలో రచ్చ...



**హైదరాబాద్, ఆగస్టు 4 పెన్ పవర్:** కేసీఆర్.. తెలంగాణ ఉద్యమ నాయకుడిగా దేశమంతటికీ పరిచయం. తెలంగాణ రాష్ట్రం సాధనలో ముందు నడిచిన నేతగా రాష్ట్రంలో ఆయనకంటూ ప్రత్యేక గుర్తింపు ఉంది. రాష్ట్రం సాధించాక పదేళ్లు ఆయన సీఎంగా పనిచేశారు. 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ను ఓడించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. దీంతో బీఆర్ఎస్లో ముసలం మొదలంది. చివరకు కేసీఆర్ కుటుంబంలోనూ చిచ్చు రేగింది. కూతురు కవిత సొంత పార్టీపైనే విమర్శలు చేయడంతో పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. దీంతో కవిత ఇటీవలే టీఆర్ఎస్ పార్టీ ప్రకటించి రాజకీయాలు చేస్తోంది. ఈ క్రమంలో పార్టీని వీడిన తర్వాత కవితపై ఆమె సోదరుడు మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. ఆమె వేరే మార్గం ఎంచుకున్నారని, పార్టీలో ఇచ్చిన అవకాశాలపై కృతజ్ఞత లేదని వ్యక్తం చేశాడు.కవిత గతంలోబీఆర్ఎస్లో ఎంపీ, ఎమ్మెల్సీగా పనిచేశారు. రాష్ట్ర ఉద్యమం, పార్టీ పెరుగుదలలో కుటుంబం కీలక పాత్ర పోషించింది. అయితే ఇటీవల కాలంలో ఆమె పార్టీ నుంచి వేరుపడి స్వతంత్ర మార్గం అనుసరిస్తున్నారు.

కొన్ని సందర్భాల్లో పార్టీ నాయకత్వం, నిర్ణయాలపై విమర్శలు చేశారు. దీనికి ప్రతిస్పందనగా కేటీఆర్ ఈ వ్యాఖ్యలు చేశారు.కవితకు పార్టీలో తగిన అవకాశాలు కల్పించినట్లు కేటీఆర్ స్పష్టం చేశారు. కేసీఆర్ రాష్ట్రం కోసం జీవితం అంకితం చేశారని గుర్తు చేస్తూ, అలాంటి వ్యక్తిపై విమర్శల దాడి చేయడం ప్రత్యర్థులకు భిన్నంగా లేదని అభిప్రాయపడ్డారు. అవకాశాలు ఇచ్చినా కృతజ్ఞత లేకుండా పార్టీ అధినేతను విమర్శించడం సహించలేని విషయమని సూచించారు. "అలానే కానివ్వండి" అనే స్వరం ద్వారా ఆమె మార్గంపై దూరం పాటించే వైఖరిని వ్యక్తం చేశారు .బీఆర్ఎస్లో కేసీఆర్, కేటీఆర్, కవిత మధ్య

వారసత్వం, నాయకత్వ పంపిణీపై అంతర్గత ఒత్తిళ్లు ఉన్నాయని గత నివేదికలు సూచిస్తున్నాయి. కవిత స్వతంత్ర పార్టీ ప్రయత్నాలు లేదా విమర్శలు ఈ ఘర్షణను బహిరంగం చేశాయి. కేటీఆర్ వ్యాఖ్యలు పార్టీలోని మిగతా నాయకులకు, కార్యకర్తలకు సందేశం ఇచ్చే ప్రయత్నంగా చూడవచ్చు. తెలంగాణ రాజకీయాల్లో కుటుంబ ఆధారిత పార్టీలు సాధారణం. అయితే ఇలాంటి విభేదాలు ఓటర్లలో గందరగోళం సృష్టించవచ్చు. ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్కు ఐక్యత అవసరం.కేటీఆర్ పార్టీని బలోపేతం చేసే ప్రయత్నంలో ఉన్నారు. కవిత తన మార్గంలో కొనసాగితే రాష్ట్ర రాజకీయాల్లో మరో కొత్త శక్తి ఆవిర్భవించే అవకాశం ఉంది. అయితే రెండు వైపులా ఉన్న విమర్శలు ప్రజల్లో నిరాశను కలిగించకుండా చూసుకోవాల్సిన అవసరం ఉంది.

# వడివడిగా బుల్లెట్ రైల్ హబ్ పనులు

**హైదరాబాద్, ఆగస్టు 4 పెన్ పవర్:** బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు గురించి తాజా సమాచారం అందుతోంది. శంషాబాద్ విమానాశ్రయానికి సమీపంలో నిర్మాణం జరుగుతున్న బుల్లెట్ రైల్ హబ్కు సంబంధించిన కొన్ని ఫొటోలు సోషల్ మీడియాలోవైరల్గా మారాయి. ఈ ప్రాజెక్టు హైదరాబాద్ నుంచి వికారాబాద్ మీదుగా పుణెకు వెళ్లనున్న రైలు మార్గాన్ని సూచిస్తున్నాయి. గూగుల్ ఎర్త్ మ్యాప్లలో ఈ మార్గం బహదూర్గూడ, సయ్యద్గూడ, పెద్ద గోల్కొండ, నందిపల్లి, రషీద్గూడ, మంఖాల్ గ్రామాల మీదుగా వెళ్తుందని స్పష్టం అవుతోంది. రైతులు ఈ మార్గం వల్ల తమ భూములు భూసేకరణకు గురవుతాయన్న ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలఅధికారులు ఈ భూములను సేకరించనున్నట్లు రైతులకు తెలిపారు. అయితే, 6 గ్రామాల్లో భూసేకరణ జరుగుతుందనే అనుమానంతో రైతులు రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్లారు. కానీ, వారికి సరైనసమాచారం అందించలేదు. దీంతో రైతుల ఆందోళన పెరిగింది. సోషల్ మీడియాలో వైరల్ అయిన ఫొటోలు పరిశీలిస్తే, రైలు మార్గం సుమారు 60 మీటర్ల వెడల్పు ఉందని తెలుస్తోంది. రైతులు తమభూములలో 40 శాతం కోల్పోయామని, మళ్లీ భూసేకరణ జరిగితే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గూగుల్ మ్యాప్లోని మార్గాన్ని పరిశీలిస్తే, 3 నెలల క్రితం ఈ మార్గంఖరారు చేయబడినట్లు తెలుస్తోంది. స్థానికులు చెప్పినట్లుగా, రైలు మార్గానికి సంబంధించిన గుర్తులను తమ పొలాలు, రహదారికి సమీపంలో వేశారని సమాచారం అందుతోంది. రవాణా రంగ నిపుణులు,హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ అధికారులు ఈ మార్గం కోసం కన్సల్టెంట్ను సంప్రదించినట్లు చెబుతున్నారు. బుల్లెట్ ట్రైన్ మార్గం 17.5 మీటర్ల వెడల్పు ఉంటుందని, మొదటి మూడు రకాలఅలైన్మెంట్లు చిత్రీకరించుకున్నాక ఒకటే మార్గాన్ని ఖరారు చేస్తారని అధికారులు వివరించారు. రాజేంద్రనగర్ ఆర్డీవో శ్రీధర్ మాట్లాడుతూ, తమకు ఏ సమాచారం లేదని, రైతులు ఆందోళన చెందవద్దనిసూచించారు.కేంద్ర ప్రభుత్వం 2026 బడ్జెట్లో దేశవ్యాప్తంగా ఏడు హై–స్పీడ్ బుల్లెట్ రైలు కారిడార్ ప్రాజెక్టులను ప్రకటించింది. ఇందులో మూడు ప్రాజెక్టులు హైదరాబాద్ కేంద్రంగా ఉంటాయి. తెలంగాణ,ఏపీ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రల పరిధిలో నిర్మాణం కానున్నాయి. తెలంగాణ వాటా కీలకంగా మారనుంది. ఈ ప్రాజెక్టుల మొత్తం దూరం 2,028 కి.మీ కాగా, ఇందులో 512 కి.మీ మేర హైస్పీడ్ట్రాక్ తెలంగాణలోనే రానుంది. హైదరాబాద్–చెన్నై ప్రాజెక్టును ఎన్హెచ్ఎస్ఆర్సీఎల్ మొదట నార్కట్పల్లి, సూర్యాపేట, ఖమ్మం మీదుగా ప్రతిపాదించింది. అయితే, రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు ఫ్యూచర్ సిటీ,నాగార్జునసాగర్ వైపు మార్గాన్ని మార్చారు. అలాగే, హైదరాబాద్–బెంగళూరు మార్గం తొలుత మహబూబ్నగర్, వనపర్తి రోడ్ వైపు ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం కోరడంతో మార్గాన్ని మార్చారు. హైస్పీడ్ రైలుప్రాజెక్టుల ఎలైన్మెంట్, విశేషాలతో రవాణా, ఆర్ అండ్ బీ శాఖ స్పెషల్ సీఎస్ వికాస్రాజ్ కేబినెట్కు నివేదిక అందించారు.శంషాబాద్లో బుల్లెట్ హబ్ నిర్మాణం జరుగుతోంది. హైదరాబాద్ దక్షిణ భారతదేశ

హైస్పీడ్ రైలు నెట్వర్క్కు ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దేలా మూడు కారిడార్లకు శంషాబాద్ వద్ద కామన్ హబ్ ప్రతిపాదించారు. ఈ మూడు మార్గాల ఎలైన్మెంట్లు కొంత దూరం రీజినల్ రింగ్ రోడ్డుసమాంతరంగా వెళ్లేలా ప్రణాళిక రూపొందించారు. హైదరాబాద్–పుణె–ముంబయి ప్రాజెక్టు డీపీఆర్ ఇప్పటికే రైల్వే బోర్డుకు చేరింది. హైదరాబాద్–బెంగళూరు, హైదరాబాద్–చెన్నై ప్రాజెక్టులకు డీపీఆర్రూపకల్పన కొనసాగుతోంది. హైస్పీడ్ కారిడార్ స్టేషన్లను వీలైన చోటల్లా మెట్రో రైలుతో అనుసంధానిస్తారు.

# మరో 15 ఏళ్లు అధికారంలో ఉండాలి: చంద్రబాబు



**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మరో 15 సంవత్సరాలు కొనసాగాల్సిన అవసరం ఉందని సీఎం చంద్రబాబు చెప్పారు. ప్రజలు ఈ విషయంలో ఆలోచన చేయాలని, వైకుంఠపాళీ రాజకీయాలు చేస్తే.. రాష్ట్రం ఎప్పటికీ.. అభివృద్ధి చెందదని అన్నారు. 2019–24 మధ్య ప్రజలు భయంతో, రాష్ట్రంలో విధ్వంసంతో జీవనం గడిపారని గుర్తు చేశారు. ఈ క్రమంలో 2024లో ఎన్డీఏ విజయం ఊహించని విప్లవం. అధికారంలోకి వచ్చాక 7 శ్వేత పత్రాలు ఇచ్చామన్నారు. ఒక ప్రభుత్వం సమర్థవంతంగా పనిచేస్తే ఎలా ఉంటుందో భోగాపురం విమానాశ్రయం ఓ ఉదాహరణగా చంద్రబాబు పేర్కొన్నారు. డేటా సెంటర్లు, ఐటీ, పోర్టులు, ఎయిర్ పోర్టులు, స్టీల్ పరిశ్రమలతో ఓ గ్రోత్ ఇంజన్‌గా మారుతోందన్నారు. 2014లో విభజన తర్వాత ఏపీ పరిస్థితి వ్యవసాయ ఆధారిత రాష్ట్రంగా మారిందన్నారు. 58 శాతం మంది జనాభా ఉంటే 46 శాతమే వనరులు ఉన్నాయని తెలిపారు. రాజధాని లేకుండా పోయిందన్నారు. విభజన సమయంలో ఆస్తుల పంపకం కూడా సవ్యంగా జరగలేదన్నారు. 2019 తర్వాత రాష్ట్రం విధ్వంసానికి గురైందని పేర్కొన్న చంద్రబాబు అన్ని విధాలా రాష్ట్రం నష్టపోయిందన్నారు. "వ్యవస్థలు కుప్పకూలాయి. శాంతిభద్రతలు లేవు. ఏపీ బ్రాండ్ దెబ్బతింది. పరిశ్రమలు పారిపోయాయి. 2024లో కూటమి అధికారంలోకి వస్తూనే ఏపీ బ్రాండ్ పునరుద్ధరించాం. సంక్షేమ కార్యక్రమాలను, అభివృద్ధిని, ప్రాంతీయ సమతుల్యతను కాపాడాం. రాజధానితో పాటు పోలవరం సహా రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టుల పునర్నిర్మాణం చేపట్టాం. ప్రగతిశీల విధానాలతో పాటు క్వాంటం లాంటి టెక్నాలజీపై దృష్టి పెట్టాం" అని వివరించారు.

**మీడియా కూడా..**

ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల విషయంలో మీడియా కూడా ప్రజలకు వివరించే గురుతర బాధ్యతను తీసుకోవాలని చంద్రబాబు సూచించారు. కేవలం వార్తలు రాయడమే కాకుండా.. ప్రజల్లో ఆలచన రేకెత్తించేలా కూడా సహకరించాలన్నారు. మీడియా తలుచుకుంటే ఏదైనా సాధ్యమేనని ఆయన వ్యాఖ్యానించారు. 2019–24 మధ్య కాలంలో నాటి ప్రభుత్వం ప్రజలను వేధించిన తీరుపై మీడియా కూడా ప్రజలకు వివరించాలన్నారు. ఆ ప్రభుత్వం ప్రజలను అణగదొక్కిందని ఆయన పేర్కొన్నారు. ఇప్పుడు రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో మంచి చెడులను కూడా మీడియా ప్రస్తావించాలని కోరారు.

# టైర్ 1 సిటీగా మారుతున్న విశాఖ



**విశాఖపట్టణం, ఆగస్టు 4, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రయాణం ఇప్పుడు కేవలం మాటలకే పరిమితం కాకుండా, కళ్లముందే నిజమై కనిపిస్తోంది. ఒకప్పుడు సాధారణంగా ఉన్న రహదారులు నేడు విశాలమైన నేషనల్ హైవేలుగా మారుతుంటే, ఏళ్ల తరబడి ఖాళీగా పడి ఉన్న భూములు ఇప్పుడు పరిశ్రమలతో కళకళలాడుతున్నాయి. సాంప్రదాయ పద్ధతుల్లో సాగిన పాఠశాలలు డిజిటల్ తరగతులుగా రూపాంతరం చెందుతున్నాయి. అలాగే సముద్ర తీర ప్రాంతాల్లో ఆధునిక వసతులతో ఫిషింగ్ హార్బర్లు అందుబాటులోకి వస్తున్నాయి. ప్రతి రంగంలోనూ వస్తున్న ఈ మార్పులు రాష్ట్ర భవిష్యత్తుపై ప్రజలకు కొత్త ఆశలను చిగురింపజేస్తున్నాయి. ఈ ప్రగతికి సాగరతీర నగరం విశాఖపట్నం నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది. గతంలో ఎన్నో ఆకర్షణీయమైన ప్రకటనలు వచ్చినప్పటికీ, ఆచరణలో అనుకున్నంత పురోగతి కనిపించలేదు. కానీ ఇప్పుడు విశాఖ నగరం కొత్త రూపు దిద్దుకుంటోంది. గూగుల్ డేటా సెంటర్, ఆర్సెలర్ మిట్టల్ ప్రాజెక్టులతో పాటు భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి రావడంతో వైజాగ్ ప్రాంతం పెట్టుబడులకు ప్రధాన కేంద్రంగా మారుతోంది. ప్రకటనల స్థానంలో క్షేత్రస్థాయి ఫలితాలు కనిపిస్తుండటంతో నగర రూపురేఖలు వేగంగా మారుతున్నాయి. పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతులు, మౌలిక వసతులు వేగంగా లభిస్తుండటంతో పారిశ్రామికవేత్తలు ఏపీ వైపు మొగ్గు చూపుతున్నారు. భూముల కేటాయింపు నుంచి పనుల ప్రారంభం వరకు ప్రభుత్వం వేగంగా నిర్ణయాలు తీసుకుంటోంది. దీనివల్ల నిన్నటివరకు నిర్మానుష్యంగా ఉన్న ప్రాంతాలు కార్పొరేట్ ఆఫీసులు, పరిశ్రమలతో నిండిపోతున్నాయి. ఈ క్రమంలో ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన యువత.. మళ్లీ సొంత రాష్ట్రానికే తిరిగి వచ్చి ఉద్యోగాలు సాధించే వాతావరణం నెలకొంటోంది. కేవలం పెద్ద ప్రాజెక్టులే కాకుండా విద్య, నైపుణ్య శిక్షణ, తీర ప్రాంతాల అభివృద్ధికి సమాన ప్రాధాన్యం ఇస్తున్నారు. ఐటీఐల ఆధునీకరణ, నైపుణ్యాభివృద్ధి శిక్షణల ద్వారా యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. సముద్ర తీరాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటూ మత్స్యకారుల సంక్షేమం నుంచి విదేశీ ఎగుమతుల వరకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారు. ఆంధ్రప్రదేశ్ సాధిస్తున్న ఈ పురోగతి కేవలం ఒక నినాదం కాదు.. అది నిర్మిస్తున్న రహదారులు, తీర్చిదిద్దుతున్న తరగతి గదులు, యువతకు లభిస్తున్న ఉద్యోగాల రూపంలో స్పష్టంగా కనిపిస్తోంది. ప్రణాళికాబద్ధమైన ఆలోచనలు, వేగవంతమైన పనులతో రాష్ట్రం వికాస బాటలో వేగంగా అడుగులు వేస్తోంది.

# మెట్రో రైల్ ప్రాజెక్ట్ పనుల్లో కీలక ముందడుగు

**విజయవాడ, ఆగస్టు 4, పెన్ పవర్:**
అమరావతి రాజధాని ప్రాంతంలో ప్రజారవాణా వ్యవస్థను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న విజయవాడ మెట్రో రైల్ ప్రాజెక్ట్ పనుల్లో మరో కీలక ముందడుగు పడింది. ప్రాజెక్ట్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు సంబంధిత అధికారులు సోషల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ సర్వేను అధికారికంగా ప్రారంభించారు. భూసేకరణ వల్ల స్థానిక ప్రజలు, వ్యాపార సంస్థలపై పడే ప్రభావాన్ని శాస్త్రీయంగా అంచనా వేసి, వారికి తగిన పరిహారం , పునరావాసం కల్పించడమే ఈ సర్వే ప్రధాన ఉద్దేశం. దీనికి సంబంధించి త్వరలోనే ప్రభావిత ప్రాంతాల ప్రజలతో రౌండ్ టేబుల్ సమావేశాలు, బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించేందుకు షెడ్యూల్ సిద్ధం చేస్తున్నారు. విజయవాడ మెట్రో మొదటి విడత నిర్మాణంలో భాగంగా రెండు ప్రధాన కారిడార్లను ప్రతిపాదించారు. మొదటి కారిడార్ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ నుండి గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయం వరకు విస్తరించి ఉండగా.. రెండో కారిడార్ రాచీదీ నుండి పెనమలూరు వరకు సాగనుంది. ఈ రెండింటికీ ప్రధాన రవాణా కేంద్రమైన పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ వద్దే రెండు ప్రత్యేక మెట్రో స్టేషన్లను ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. నగరం నడిబొడ్డున ఉన్న బస్ స్టేషన్, రైల్వే స్టేషన్లతో పాటు గన్నవరం ఎయిర్‌పోర్టును మెట్రో ద్వారా అనుసంధానించడం వల్ల ప్రయాణికులకు సత్వర , సునాయాస రవాణా వసతి లభించనుంది. గతంలో నిలిచిపోయిన ఈ మెట్రో ప్రాజెక్ట్‌ను మళ్లీ పట్టాలెక్కించేందుకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తుండటంతో విజయవాడ , అమరావతి పరిసర ప్రాంతాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ప్రాజెక్ట్‌కు అవసరమైన అనుమతులు, డిజైన్లు , భూసేకరణకు సంబంధించిన పనులు సమాంతరంగా జరుగుతుండటం ప్రాజెక్ట్ అమలుపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని స్పష్టం చేస్తోంది. సోషల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ , ప్రజాభిప్రాయ సేకరణ పూర్తయిన వెంటనే భూసేకరణ తుది ప్రక్రియ ప్రారంభమై, విజయవాడ మెట్రో నిర్మాణ పనులు క్షేత్రస్థాయిలో ప్రారంభం కానున్నాయి.

# నారా లోకేష్ కేంద్రంగా రాజకీయాలు

**విజయవాడ, ఆగస్టు 4, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో విచిత్ర పరిస్థితులు నెలకొన్నాయి. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కేంద్రంగా రాజకీయాలు పరిభ్రమిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి లోకేష్ క్రియాశీలక పాత్ర పోషిస్తుండటం అందరికి తెలిసిందే. అధికార పక్షంలో ఆయనే కీలకమయ్యారు. ప్రతిపక్షం కూడా ఆయన పైనే గురి పెట్టింది. దాంతో లోకేష్ గ్రాఫ్ పెరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు వయసు 75 సంవత్సరాలు దాటాయి. ఇప్పటికే అయన నాలుగు సార్లు ముఖ్యమంత్రి గా ప్రమాణ స్వీకారం చేశారు. 16 ఏళ్ళు ముఖ్యమంత్రిగా సుదీర్ఘకాలం పనిచేసిన ఏకైక ముఖ్యమంత్రిగా రికార్డు సృష్టించారు. అయితే రాబోయే కాలంలో తన కుమారుడు లోకేష్ ను ముఖ్యమంత్రిని చేయాలని భావిస్తున్నట్టు చెబుతున్నారు.
ఇప్పటికే టీడీపీ వర్కింగ్ ప్రసిడెంట్ పదవి అప్పజెప్పారు. పార్టీ కీలక అంశాలని కుమారుడికి అప్పగించేశారు. ఇక మిగిలింది పట్టాభిషేకం. పరిపాలనా అనుభవం కోసం విదేశాలు తిప్పుతున్నారు.
తరచుగా ఢిల్లీకి పంపిస్తున్నారు. కేంద్రంలోని మంత్రులతో మాట్లాడిస్తున్నారు. ప్రభుత్వంలో తీసుకునే కీలక నిర్ణయాలలో లోకేష్ ను ఇన్వాల్వ్ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. రాబోయే కాలంలో లోకేష్ ముఖ్యమంత్రి కావడం ఖాయంగా కనిపిస్తుంది. ప్రతిపక్ష వైసీపీ లోకేష్ ను టార్గెట్ చేసుకొని రాజకీయాలు చేస్తుండడం గమనించవచ్చు. నిన్నా మొన్నటి వరకు లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారంటూ విమర్శలు గుప్పించిన వైసీపీ ఇప్పుడు డీఎస్సి అక్రమాల గురించి పోరాటం స్టార్ట్ చేసింది. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తరహాలోనే లోకేష్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు
చేసింది. అంటే భవిష్యత్తులో తాము లోకేష్ తోనే పోరాడాల్సి వస్తుందని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్థిర నిర్ణయానికి వచ్చారని విశ్లేషకులు చెబుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లను సైతం పక్కన పెట్టి లోకేష్ పై బాణం ఎక్కు పెట్టడం దీనికి నిదర్శనమని పేర్కొంటున్నారు . మొత్తం మీద అటు అధికార పార్టీ లోకేష్ చుట్టూ తిరుగుతుంటే ఇటు ప్రతిపక్షం కూడా లోకేష్ కేంద్రంగానే విమర్శలు గుప్పిస్తుండడం విశేషం.

# ఆశావహులు.. అదుపు తప్పుతున్నారా

**కాకినాడ, ఆగస్టు 4, పెన్ పవర్:**
టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు ధిక్కార స్వరం వినిపిస్తున్నారా? స్థానికంగా తన హవాను పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నారా? అంటే.. అవుననే సమాధానమే టీడీపీ వర్గాల్లో వినిపిస్తోంది. కాకినాడ పోర్టును విస్తరించే పనులకు ఆయన సుముఖంగానే ఉన్నా.. పార్టీ పరంగా ఆయన వ్యవహరించడం లేదనే టాక్ వినిపిస్తోంది. కాకినాడ పోర్టకు కోన పోర్టుగా పేరు పెట్టాలన్నది యనమల డిమాండ్. అయితే.. ఇది సాధ్యమేనా? అనేది ప్రశ్న పైగా ఎవరికీ లేని ఈ డిమాండ్ విషయంలో యనమల స్థానికతను పురిగొల్పుతున్నారు. పోర్టుకు అవసరమైన భూములు ఇస్తోంది కోనసీమ ప్రాంత రైతులని, కాబట్టి.. పోర్టుకు కోన పేరు పెట్టాలన్నది యనమల సూచన. ఇదే ఇప్పుడు డిమాండ్‌గా మారుతోంది. ఈ నెల 20లోగా ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకుని కోన పోర్టుగా పేరు నిర్ధారించాలని.. లేకపోతే, ప్రజల ఆకాంక్షల మేరకు తాను కూడా వ్యవహరిస్తానని చెప్పు కొచ్చారు. ఈ వ్యవహారంపై ఆయన ప్రభుత్వానికి లేఖ కూడా రాశారు. తాజాగా స్థానికులతో భేటీ కావడం మరింత ఆసక్తిగా మారింది. కోన సీమ రైతు ల నుంచి భూములు తీసుకుంటున్నారని, అలాంటప్పుడు కాకినాడ పోర్టు అని పేరు ఎందుకని ఆయన చెబుతున్నారు. అయితే.. వాస్తవానికి.. భూములు తీసుకున్నంత మాత్రాన అదే పేరును ఉంచాలని ఏమీ లేదు. ఈ విషయం తెలిసినప్పటికీ.. యనమల మాత్రం తన దారి తనదే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. స్థానికంగా ఇది పెద్ద ఉద్యమంగా మారాలని ఆయన ఆకాంక్షిస్తున్నట్టు తెలుస్తోంది. ప్రాధాన్యం కొరవడడంతోనే.. ఇటు పార్టీలోను, అటు ప్రభుత్వంలోనూ యనమల ప్రాధాన్యం ఒకప్పుడు ఉన్నట్టుగా ఇప్పుడు లేదు. గతంలో తిప్పిన చక్రం.. ఇప్పుడు మూలబడినట్టుగా ఆయన పరిస్థితి మారిపోయింది. ఎమ్మెల్సీగా రిటైరైన తర్వాత.. రాజ్యసభ ఆశించారు. లేదా గవర్నర్ గిరీ కోసం ప్రయత్నిస్తున్నారు. ఈ రెండు చేజారుతున్నా యి. పైగా తన ముందు రాజకీయాల్లోకి వచ్చిన వారికి పదవులు దక్కుతున్నాయి. ఈ నేపథ్యంలో పార్టీ తనను పూర్తిగా పక్కన పెడుతోందని గ్రహిస్తున్న ఆయన.. ఇలా.. కీలక విషయాలపై ఫోకస్ చేశారని రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్న మాట.

## వేమండలో '2 ఏళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం' పాల్గొన్న విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

- **రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే**
- **ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించిన యార్లగడ్డ**
- **వేమండలో ఇప్పటివరకు రూ.1.25 కోట్ల అభివృద్ధి పనులు పూర్తయ్యాయని వెల్లడి**
- **కలవపాముల రహదారి అభివృద్ధికి ప్రత్యేక నిధులు సాధిస్తామని హామీ**
- **గత ప్రభుత్వం రహదారులను నిర్లక్ష్యం చేసిందని ఎమ్మెల్యే యార్లగడ్డ విమర్శ**

హైదరాబాద్ పెన్ పవర్:
ఉంగుటూరు మండలం వేమండ గ్రామంలో సోమవారం నిర్వహించిన '2 ఏళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పాల్గొన్నారు. అంతకుముందు రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ గత రెండేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, గన్నవరం నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి పనులను కరపత్రాల ద్వారా ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం అభివృద్ధిని పూర్తిగా విస్మరించడంతో రహదారులు దయనీయ స్థితికి చేరుకున్నాయని విమర్శించారు. గత ఐదేళ్లలో గుడివాడ – కలవపాముల, తరిగొప్పల – మానికొండ తదితర ప్రాంతాలకు వెళ్లే రహదారులు గుంతలమయంగా మారినా పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దెబ్బతిన్న రహదారులలో సుమారు 80 శాతం మేర అభివృద్ధి పనులు పూర్తి చేశామని, మిగిలిన పనులను కూడా దశలవారీగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. వేమండ గ్రామంలో ఇప్పటికే ఆరు సీసీ రోడ్లు, పంచాయతీ కార్యాలయ మరమ్మతులు, వాటర్ ట్యాంక్ మరమ్మతులు, హెడ్ పంప్ ఏర్పాటు వంటి పనులు చేపట్టినట్లు చెప్పారు. ఆర్డీఎస్ఎస్ పథకం కింద రూ.37 లక్షల వ్యయంతో 250 విద్యుత్ స్తంభాల మార్పిడి, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, రూ.12 లక్షలతో వ్యవసాయ విద్యుత్ సేవల అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. గ్రామంలో ఇప్పటివరకు సుమారు రూ.1.25 కోట్ల విలువైన అభివృద్ధి పనులు పూర్తయ్యాయని తెలిపారు. కలవపాముల రహదారి అభివృద్ధికి సుమారు రూ.1.70 కోట్లుఅవసరమవుతున్నాయని, ఈ సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక నిధులు సాధించేందుకు కృషి చేస్తానన్నారు. గ్రామంలో మిగిలిన సిమెంట్ రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల పనులకు కూడా ప్రాధాన్యమిస్తూ రాబోయే రోజుల్లో మరిన్ని నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. సంక్షేమంతో పాటు అభివృద్ధిని సమానంగా ముందుకు తీసుకెళ్తున్నామని, ప్రజలు కోరిన ప్రతి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉంగుటూరు మండల తహసీల్దార్ జలాది విమల కుమారి, ఎంపీడీవో ఈ సత్య కుమార్, మండల టిడిపి అధ్యక్షులు కొలుసు రవీంద్రబాబు, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి కుందేటి చంద్రశేఖర్, తోట నాగభూషణం, కాపుదాసి సునీల్, గన్నవరం ఏఎంసీ డైరెక్టర్ కొండేటి వెంకటేశ్వరరావు, తేలప్రోలు పిఏసిఎస్ చైర్ పర్సన్ ఆరుమళ్ళ కృష్ణారెడ్డి, ఉయ్యూరు మురళి, బెజవాడ నాగేశ్వరరావు, రాజబోయిన శివాజీ, తుమ్మల జగదీష్, యర్రగుంట్ల వినోద్, చల్లగుల్ల సందీప్, కొసరాజు సాయిరాం, పసుపులేటి సుబ్బారావు, కానూళ్ల శ్రీను, పకీరు, పొన్నగంటి బాలకృష్ణ, వెనిగళ్ళ రాము, గంప భీమయ్య, యలమంచిలి దినేష్, మరీదు శ్రీను, శివరాం, తుమ్మల లత, పొట్లూరి భువనేశ్వరి జనసేన నాయకులు చిమట రవి వర్మ తదితరులు పాల్గొన్నారు.

# జగన్ ఇంటి ముందు కలకలం.. బోరుగడ్డ యూటర్న్, సజ్జలపై తీవ్ర ఆరోపణలు

**హైదరాబాద్ పెన్ పవర్:** తాడేపల్లిలోని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి నివాసం ముందు వైసీపీ సానుభూతిపరుడు బోరుగడ్డ అనిల్ కుమార్ సంచలన ఆందోళనకు దిగారు. తనను పార్టీ కార్యాలయం లోపలకు అనుమతించడం లేదని నిరసన వ్యక్తం చేశారు. అంతేకాకుండా పార్టీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిపై తీవ్ర వ్యాఖ్యలతో అందరికీ షాక్ ఇచ్చారు. తాను వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అభిమాని అని, ఆయన కోసం పనిచేసిన తనకు పార్టీలో కనీస గౌరవం లేకుండా చేస్తున్నారని బోరుగడ్డ ఫైర్ అయ్యారు. జగన్ కోసం పనిచేసిన తనపై 22 కేసులు నమోదు చేశారని, తన కంపెనీలు మూసివేతకు గురయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. తన భార్యతో కలిసి జగన్ నివాసం వద్ద బోరుగడ్డ బైఠాయించడంతో కలకలం చెలరేగింది. వైసీపీ అధినేత జగన్ రెడ్డి నివాసం, పార్టీ కేంద్ర కార్యాలయం ముందు అనూహ్యంగా బోరుగడ్డ అనిల్ కుమార్ భార్యతో కలిసి బైఠాయించడం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వైసీపీ అభిమానిగా ఎన్నో త్యాగాలు చేసిన తాను అధినేతను కలుస్తానంటే పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అడ్డుకుంటున్నారని ఆరోపించారు. అంతేకాకుండా సజ్జల కోటరీతో తనను రౌడీషీటర్ అంటూ ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. తనపై రౌడీషీట్ లేదని హైకోర్టు చెప్పినా, వైసీపీ అధికార ప్రతినిధి కారుమూరి వెంకట్ రెడ్డి మాత్రం బోరుగడ్డ రౌడీషీటర్ అంటూ మాట్లాడుతున్నారని, ఆయనకు నోటీసులు పంపానని వెల్లడించారు. ఈ సమయంలో గతంలో తాను కారుమూరు వెంకటరెడ్డితో మాట్లాడిన ఫోన్ కాల్ ఆడియోను మీడియాకు వినిపించారు. తాను పార్టీ కోసం కష్టపడ్డానని, 9 నెలలు జైలులో ఉన్నానని అయినా తనను పార్టీ ఆఫీసులోకి రానీయడం లేదన్నారు. దళితులు మా మేనమామలు అని చెప్పే జగన్ రెడ్డి ఈ విషయంలో కల్పించుకోవాలని డిమాండ్ చేశారు. తనపై సజ్జల రామకృష్ణారెడ్డి కుట్ర పన్నుతున్నారని, ఈ విషయాలు ఏవీ ఆయనకు తెలియవని ఆరోపించారు. తమకు జగన్ రెడ్డి మాత్రమే నాయకుడు అని, సజ్జల నాయకుడు కాదని వ్యాఖ్యానించారు. ఇస్త్రీ బట్టలు వేసుకుని పార్టీ కార్యాలయంలో కూర్చునే సజ్జలకు ఇక్కడ పనేమీ లేదన్నారు. తమలాంటి వారు పార్టీ కోసం కష్టపడుతున్నామని, కేసులు పెట్టించుకుని రోడ్డు మీదపడ్డామని వాపోయారు. జగన్ సతీమణి భారతి, తల్లి విజయమ్మను అవమానించారనే తాను బయటకు వచ్చానని, అయినా అవమానిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ ఆఫీసుకు రమ్మని నాలుగు గంటలు కూర్చోబెట్టారని అయినా జగన్ రెడ్డిని కలవనీయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, వైసీపీ అభిమానిగా చెప్పుకుంటున్న బోరుగడ్డ ఆకస్మికంగా నిరసనకు దిగడంతో తాడేపల్లిలోని మాజీ ముఖ్యమంత్రి జగన్ నివాసం వద్ద కలకలం చెలరేగింది. అంతేకాకుండా పార్టీలో జగన్ తర్వాత ఎక్కువ ప్రాధాన్యం ఉండే పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జలపై అత్యంత తీవ్ర వ్యాఖ్యలతో బోరుగడ్డ విమర్శలు గుప్పించడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ అవుతోంది. ఎన్నడూలేని విధంగా బోరుగడ్డ ఇలా ఆందోళనకు దిగడం వెనుక కారణాలు ఏంటి అనే చర్చ ఎక్కువగా జరుగుతోంది. వైసీపీ అధికారంలో ఉండగా, ఆ పార్టీ సానుభూతిపరుడిగా చెప్పుకుంటూ సోషల్ మీడియాలో బోరుగడ్డ చేసిన వ్యాఖ్యలు, ప్రత్యర్థులపై దారుణ దూషణలతో వైసీపీకి తీవ్ర నష్టం జరిగిందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# యూపీ ఎన్నికల ముందు బీజేపీకి గట్టి హెచ్చరిక.. బంకీపూర్ ఫలితాలతో మేల్కోవాల్సిందే...




బిహార్ రాష్ట్ర రాజధాని నడిబొడ్డున ఉన్న బంకీపూర్ అసెంబ్లీ ఉప ఎన్నిక ఫలితాలపై జాతీయస్థాయిలో విస్తృత చర్చ జరుగుతోంది. ఈ ఉప ఎన్నిక ఫలితంతో ఇప్పటికిప్పుడు వచ్చే రాజకీయ మార్పు ఏమీ లేకపోయినప్పటికీ, భవిష్యత్తులో మారనున్న సమీకరణాలకు బంకీపూర్ ఒక సంకేతంగా నిలుస్తుందా? అన్నదే హాట్ టాపిక్ అవుతోంది. ఈ ఉప ఎన్నికల్లో జనసురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు, ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ విజయం సాధించారు. గత ఏడాది నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ బిహార్ లో ఎక్కడా డిపాజిట్ దక్కించుకోలేదు. కానీ, ఇప్పుడు ప్రశాంత్ కిషోర్ ఊహించని విధంగా సంచలన విజయం సాధించారు. అంతేకాకుండా బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితీన్ నబీన్ ప్రాతినిధ్యం వహించిన స్థానాన్ని తన ఖాతాలో వేసుకుని అందరినీ ఆశ్చర్యానికి గురిచేశారు.

దేశంలో మొత్తం మూడు రాష్ట్రాల్లో 3 స్థానాలకు ఉప ఎన్నికలు జరిగాయి. ఇందులో బీజేపీ ఒక చోట, కాంగ్రెస్ మరోచోట గెలిచాయి. ఈ రెండు స్థానాలు ఆయా పార్టీలు గతంలో ప్రాతినిధ్యం వహించినవి కావడంతో పెద్దగా ప్రాధాన్యం లేకపోయిందని అంటున్నారు. కానీ బంకీపూర్ ఉప ఎన్నిక మాత్రం బీజేపీ అధిష్టానానికి గట్టి షాక్ గానే చెబుతున్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు నితీన్ నబీన్ ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గమే కాకుండా, బిహార్ లోని తొలి బీజేపీ ప్రభుత్వానికి ఈ ఫలితం పెద్ద ఎదురుదెబ్బగా భావిస్తున్నారు. సహజంగా ఉప ఎన్నికల ఫలితాలు అధికార పార్టీకి అనుకూలంగా ఉంటాయని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. అయితే బంకీపూర్ లో ఆ పరిస్థితి కనిపించకపోవడంపైనే ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.ఇక బంకీపూర్ ఉప ఎన్నిక బీజేపీపై పెరుగుతున్న వ్యతిరేకతకు నిదర్శనమా? అనే చర్చ ఎక్కువగా జరుగుతోంది. పుష్కరకాలంగా దేశంలో అధికారంలో ఉన్న బీజేపీపై సహజంగా కొంత వ్యతిరేకత ఉంటుందని చెబుతున్నారు. అయితే గత 12 ఏళ్లుగా ఇలాంటి వ్యతిరేకతను అధిగమిస్తూ సరికొత్త వ్యూహాలతో బీజేపీ వరుస విజయాలు సాధిస్తూ ఏ పార్టీకి లేని రికార్డులను నమోదు చేస్తోంది. అంతేకాదు 2014లో పార్టీ కేంద్రంలో అధికారంలోకి రాకముందు మనగడ లేని రాష్ట్రాలను సైతం గెలుస్తూ బీజేపీ ఏ పార్టీ సాటిలేదని నిరూపించింది. కానీ, ఒక్క గాలివానకు అంతా తుడిచిపెట్టుకుపోయినట్లు ఇప్పటివరకు బీజేపీ విజయాలన్నీ బంకీపూర్ ఉప ఎన్నిక ఫలితం తర్వాత తెరమరుగు అవడమే సంచలనంగా మారిందని అంటున్నారు.మరోవైపు బంకీపూర్ ఉప ఎన్నికతో బీజేపీ అధిష్టానం మేల్కొనాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని అంటున్నారు. ముఖ్యంగా బీజేపీ ప్రభుత్వం దేశంలో మనుగడ సాధించేందుకు ప్రధాన కారణంగా చెబుతున్న యూపీ అసెంబ్లీ ఎన్నికల ముందు ఈ పరిణామం ఒక హెచ్చరికగా భావించాల్సి ఉందని అంటున్నారు. బంకీపూర్ ఓటర్లు బీజేపీని తిరస్కరించడానికి గల కారణాలు విశ్లేషించి ఆ తప్పులు సరిచేసుకోవాల్సిన అవసరం ఉందని అంటున్నారు. ఎందుకంటే బంకీపూర్ స్థానం గత 30 ఏళ్లుగా కాషాయ జెండాకు కంచుకోటగా ఉండటమే కాకుండా, ప్రత్యర్థికి దక్కిన తొలి విజయం కూడా పెను సంచలనానికి ముందస్తు సంకేతంగా భావించాల్సివుంటుందని వ్యాఖ్యానిస్తున్నారు.ఇక బంకీపూర్ ఉప ఎన్నిక తర్వాత విపక్షాలకు ఎక్కడా లేని ఉత్సాహం వచ్చిందని అంటున్నారు. ప్రధానంగా బీజేపీకి గట్టి పట్టున్న హిందీ బెల్ట్ లో విపక్షం పైచేయి సాధించేలా తాజా ఎన్నికల ఫలితాలు ఊపు తీసుకువచ్చాయని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. బంకీపూర్ లో జనసురాజ్ పార్టీ గెలవడం ఒక ఎత్తు అయితే, మధ్యప్రదేశ్ లోని బలమైన ప్రభుత్వాన్ని ఢీకొట్టి కాంగ్రెస్ తన స్థానాన్ని నిలబెట్టుకోవడం కూడా చెప్పుకోవాల్సిన అంశమే అంటున్నారు. ఈ పరిస్థితులు విపక్షాలకు భవిష్యత్తుపై ఆశలు పెంచుతున్నాయని చెబుతున్నారు.

# బిడ్డను పెంచేందుకు రూ.1.39 కోట్లు ఖర్చా? వైరల్ వీడియోపై నెటిజన్లలో చర్చ



పిల్లోడు పుట్టగానే "హాస్పిటల్‌కి స్వాగతం" అనడానికి బదులు "మీ బిల్లు రూ.1.39 కోట్లు సార్" అని హ్యాండ్ ఓవర్ చేస్తే ఎలా ఉంటుంది? సరిగ్గా అలాంటి షాకే ఇచ్చాడో సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్. ఒక చిన్నారిని 18 ఏళ్లు పెంచడానికి దాదాపు రూ.1.39 కోట్లు ఖర్చవుతుందంటూ ఆయన వేసిన 'షాకింగ్' క్యాలిక్యులేషన్స్ చూసి.. నెటిజన్లు "అంతేనా.. కాలేజీ ఫీజులు, పెళ్లి ఖర్చులు ఆఫర్ కింద ఉచితంగా ఇస్తున్నారా ఏంటి?" అంటూ సెటైర్లు వేస్తున్నారు.భారతదేశంలో ఒక బిడ్డను పుట్టినప్పటి నుంచి 18 ఏళ్ల వయసు వచ్చే వరకు పెంచేందుకు సుమారు రూ.1.39 కోట్లు ఖర్చవుతుందని ఓ సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ చేసిన వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. పిల్లల పెంపకం, విద్య, వైద్యం, జీవన వ్యయాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ఈ వీడియో విస్తృత చర్చకు దారి తీసింది. అయితే ఇందులో పేర్కొన్న లెక్కలు అధికారిక ప్రభుత్వ గణాంకాలు లేదా ఏదైనా పరిశోధనా సంస్థ నివేదిక ఆధారంగా వెల్లడించినవి కావని.. ఇన్ఫ్లుయెన్సర్ చేసిన అంచనాలేనని గుర్తుంచుకోవాలి.

వైరల్ వీడియోలో తెలిపిన వివరాల ప్రకారం.. ఒక చిన్నారిని 18 ఏళ్ల వరకు పెంచేందుకు అయ్యే మొత్తం ఖర్చులో విద్యకే అత్యధికంగా రూ.75 లక్షలు వెచ్చించాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఇందులో స్కూల్ ఫీజులు, పుస్తకాలు, కోచింగ్, అదనపు శిక్షణ, ఇతర విద్యా సంబంధిత వ్యయాలు కూడా ఉంటాయని వివరించారు. ఆ తర్వాత ఆహారం కోసం సుమారు రూ.30 లక్షలు ఖర్చవుతాయని చెప్పారు.అదే విధంగా వైద్య ఖర్చులు, టీకాలు, ఆరోగ్య పరీక్షలు, దుస్తులు, ప్రయాణాలు, వినోదం, ఇతర నిత్యావసర అవసరాలకు మిగిలిన మొత్తం వెచ్చించాల్సి వస్తుందని వీడియోలో వివరించారు. ముఖ్యంగా ప్రైవేట్ విద్యాసంస్థలు, నగరాల్లో పెరుగుతున్న జీవన వ్యయం, ఆరోగ్య సేవల ఖర్చులు ఈ లెక్కలకు ప్రధాన కారణాలుగా ఇన్ఫ్లుయెన్సర్ పేర్కొన్నారు.ఈ వీడియో సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చకు దారి తీసింది. కొందరు నెటిజన్లు ప్రస్తుతం పిల్లలను పెంచడం నిజంగానే చాలా ఖరీదైన వ్యవహారంగా మారిందని.. అందుకే చాలామంది కుటుంబాలు ఒకే బిడ్డతో పరిమితమవుతున్నాయని లేదా పిల్లలను కనడంపై ఆర్థిక కోణంలో ఆలోచిస్తున్నారని అభిప్రాయపడ్డారు. మరికొందరు పెరుగుతున్న ద్రవ్యోల్బణం, విద్యా వ్యవస్థలో అధిక ఫీజులు, వైద్య ఖర్చులు కుటుంబాలపై తీవ్ర భారం మోపుతున్నాయని వ్యాఖ్యానించారు.మరోవైపు ఈ వీడియోలో చెప్పిన ఖర్చులను కొందరు అతిశయోక్తిగా కొట్టిపారేశారు. ప్రతి కుటుంబం జీవనశైలి, ఆదాయం, నివాస ప్రాంతం, పిల్లల విద్య కోసం ఎంచుకునే సంస్థలను బట్టి ఖర్చులు మారుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆరోగ్య సేవలు వినియోగించే కుటుంబాల్లో ఈ వ్యయం చాలా తక్కువగా ఉండొచ్చని అభిప్రాయపడ్డారు.ఇక మరికొందరు నెటిజన్లు డబ్బుతో పిల్లల విలువను కొలవలేమని వ్యాఖ్యానించారు. సంతానం ఇచ్చే ఆనందం, కుటుంబానికి తీసుకొచ్చే సంతోషం, భావోద్వేగ బంధం ముందు డబ్బు పెద్ద విషయం కాదని వారు కామెంట్లు చేస్తున్నారు. మొత్తంగా ఈ వైరల్ వీడియో పిల్లల పెంపకం ఖర్చులపై, కుటుంబ ఆర్థిక ప్రణాళికపై, నేటి జీవన వ్యయాలపై మరోసారి దేశవ్యాప్తంగా చర్చకు తెరలేపింది.

# బంకీపూర్ లో బీజేపీ సెల్ఫ్ గోల్.. ఈ తప్పులతోనే ఓటమి!



బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితీన్ నబీన్ ప్రాతినిధ్యం వహించిన బిహార్ లోని బంకీపూర్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ ఓటమిని ఎదుర్కొవడం హాట్ టాపిక్ అవుతోంది. గత ఏడాది నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడ నుంచి నితీన్ నబీన్ సుమారు 50 వేల ఓట్ల ఆధిక్యంతో గెలవగా, కేవలం 10 నెలల వ్యవధిలో జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి నీరజ్ సిన్హా ఘోర పరాజయం పాలవడంపై విస్తృత చర్చ జరుగుతోంది. వరుసగా ఐదు ఎన్నికల్లో ఈ స్థానం నుంచి గెలిచిన బీజేపీ తాజా ఉప ఎన్నికలలో బోల్తా పడటానికి కారణాలు ఏంటి? అన్న అంశంపై తీవ్ర తర్జనభర్జన కొనసాగుతోంది. ఇక బిహార్ లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన 4 నెలలకే చేదు ఫలితం మూటగట్టుకోవడాన్ని పార్టీ అగ్ర నాయకత్వం జీర్ణించుకోలేకపోతోందని అంటున్నారు.

బంకీపూర్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో జనసురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు, ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ గెలుపుకంటే బీజేపీ ఓటమే ఎక్కువ చర్చగా మారింది. పట్నా నగరానికి గుండెకాయ వంటి బంకీపూర్ నియోజకవర్గం గత 30 ఏళ్లుగా కాషాయ కోటగా ఉండగా, ఎన్నికల ప్రకటన విడుదలైన తర్వాత నియోజకవర్గంలో అడుగుపెట్టిన ప్రశాంత్ కిషోర్ సునాయాశంగా గెలవడమే అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పది నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కనీసం ఒకచోట కూడా డిపాజిట్ తెచ్చుకోని జనసురాజ్ పార్టీ ఇప్పుడు మిగిలిన ప్రధాన పార్టీలను వెనక్కి నెట్టి విజేతగా ఆవిర్భవించడం విశేషంగా వ్యాఖ్యానిస్తున్నారు. అయితే ఈ గెలుపునకు బీజేపీ వైఫల్యమే ఎక్కువ కారణమని విశ్లేషిస్తున్నారు.బంకీపూర్ లో బీజేపీ ఓటమికి దారి తీసిన కారణాలపై పరిశీలకుల విశ్లేషణలు ఆసక్తి రేపుతున్నాయి. ముఖ్యంగా సునాయాశంగా గెలిచేస్తామన్న బీజేపీ ధీమానే దారుణ ఓటమికి దారితీసిందని వ్యాఖ్యానిస్తున్నారు. దీనికి ఉదాహరణగా పోలింగ్ సరళిని చూపుతున్నారు. జూలై 30న జరిగిన పోలింగులో కేవలం 34.30 శాత్రమే ఓటింగ్ జరగడం బీజేపీ ఓటమికి ప్రధాన కారణంగా విశ్లేషిస్తున్నారు. కేవలం పది నెలల వ్యవధిలో జరిగిన ఉప ఎన్నికపై ఓటర్లు పెద్దగా ఆసక్తి చూపకపోవడం, బలమైన ఓటు బ్యాంకు ఉన్న బీజేపీ ఎలాగైనా గెలిచేస్తామన్న ధీమాలో పడిపోవడంతోనే అత్యల్ప ఓటింగ్ నమోదైందని అంటున్నారు. బీజేపీ కేడర్ బలంగా పనిచేసి ఓటర్లను పోలింగ్ కేంద్రం వరకు తీసుకువచ్చి ఉంటే ఫలితం మరో విధంగా ఉండేదని అభిప్రాయపడుతున్నారు.

అంతేకాకుండా బంకీపూర్ ఉప ఎన్నిక నోటిఫికేషన్ రాగానే అభ్యర్థి ఎంపికలో బీజేపీ చేసిన పొరపాట్లు కూడా ఓటమికి దారితీశాయని అంటున్నారు. ముందుగా అభిషేక్ మిశ్రాను అభ్యర్థిగా ప్రకటించారని, ఆ తర్వాత ఆయన కుటుంబంపై అవినీతి ఆరోపణలు ఉన్నాయనే కారణంగా కేవలం 30 గంటల వ్యవధిలో నీరజ్ కుమార్ సిన్హాను బరిలోకి దింపుతున్నట్లు ప్రకటించారని అంటున్నారు. ఈ అంశాన్ని తనకు అనుకూలంగా మార్చుకున్న జనసురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిషోర్ ఎన్నికల ప్రచారంలో అధికార పార్టీని దెబ్బతీశారని అంటున్నారు.

ఇక ఎన్నికల ప్రచారంలో బీజేపీ నేతలు చేసిన వ్యాఖ్యలు కూడా ఓటర్ల ఆగ్రహానికి గురిచేశాయంటున్నారు. బంకీపూర్ లో తాము కుక్కను నిలిపినా జనం ఓట్లేస్తారన్నట్లు బీజేపీ నేతలు ప్రచారం చేశారని, దీంతో ఓటర్లు మనస్థాపానికి గురయ్యారని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఇప్పటివరకు తాము నితీన్ నబీన్ ఆయన తండ్రి నవిన్ కిషోర్ ప్రసాద్ సిన్హాను చూసి ఓట్లేశామని,

కానీ ఇప్పుడు బీజేపీ నేతలు మాత్రం ఓటర్లను చిన్నచూపు చేసేలా ప్రచారం చేశారని స్థానికులు మండిపడుతున్నారని అంటున్నారు. అందుకే ప్రత్యామ్నాయం ఉంటే ఓటర్లు తీర్పు మారుతుందనే సంకేతాలు ఇచ్చేలా ప్రశాంత్ కిషోర్ కు బాసటగా నిలిచారని విశ్లేషిస్తున్నారు.

మరోవైపు ఢిల్లీలో జరిగిన జెన్-జీ ఆందోళనలు, నీట్ పేపరు లీకేజీ, 12వ తరగతి మూల్యాంకనంలో లోపాలు, అయోధ్య రామమందిరం విరాళాల మాయం వంటి పరిణామాలు కూడా బీజేపీపై తీవ్ర ప్రభావం చూపాయని అంటున్నారు. ఎన్నికల సమయంలో ఆయా అంశాలను ప్రజల మధ్యకు తీసుకువెళ్లడంలో జనసురాజ్ పార్టీ అభ్యర్థి ప్రశాంత్ కిషోర్ సక్సెస్ అయ్యారని అంటున్నారు. ఇలా కర్ణుడి చావుకి సవాలక్ష కారణాలు అన్నట్లు బంకీపూర్ లో బీజేపీ ఓటమికి అనేక పరిణామాలు దారితీశాయని విశ్లేషిస్తున్నారు.

# గంజాయి స్మగ్లర్ల జాబితా నా దగ్గరుంది.. : బాంబు పేల్చిన ఏపీ స్పీకర్




ఏపీ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తాజాగా బాంబు పేల్చారు. రాష్ట్రంలో గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న వారి జాబితా తన దగ్గర ఉందని పేర్కొన్నారు. అంతేకాదు.. పోలీసులను ఉద్దేశించి కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. తన వద్ద ఉన్న జాబితాను పోలీసులకు పంపిస్తానని.. దమ్ముంటేవారిని అరెస్టు చేయాలని ఆయన సవాల్ రువ్వారు. అదేసమయంలో గంజాయి స్మగ్లర్లను సాదాసీదా జైల్లో పెడుతున్నారని.. ఇది వారికి ఎంజాయ్ మెంటుగా మారిపోయిందని వ్యాఖ్యానించారు. అలా కాకుండా... గంజాయి స్మగ్లర్లను అండమాన్ జైల్లో పెట్టాలని సూచించారు. ఈ వ్యాఖ్యలు తీవ్ర కలకలం రేపుతున్నాయి.

**ఏం జరిగింది?**

'సంకల్పం-2.0' పేరుతో ప్రభుత్వం రాష్ట్రంలో గంజాయి నిర్మూలనపై ప్రత్యేక కార్యక్రమాన్నినిర్వహిస్తోంది. ప్రతి సోమవారం నియోజకవర్గాలు, నగరాల్లో నిర్వహిస్తున్న కార్యక్రమానికి ఎమ్మెల్యేలు, మంత్రులు ఎంపీలు కూడా హాజరవుతున్నారు. ఈ క్రమంలో సోమవారం అనకాపల్లి నియోజకవర్గంలో నిర్వహించిన కార్యక్రమంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు పాల్గొన్నారు. సహజంగానే సంచలన ఆరోపణలు చేసే ఆయన.. గంజాయి నిర్మూలన, పోలీసుల వైఖరిపై కూడా అలానే వ్యాఖ్యలు సంధించారు. విశాఖపట్నంలోని ఇంజనీరింగ్ కాలేజీ హాస్టళ్లలో విద్యార్థులు రాత్రి పూట గంజాయి తాగుతున్నారని ఆయన వ్యాఖ్యానించారు. ఇది తాను ఆరోపిస్తున్నది కాదని.. పోలీసు రికార్డులే చెబుతున్నాయని అయ్యన్న అన్నారు. పిల్లలను కాలేజీలకు పంపేసి ఫీజులు కట్టేసి తల్లిదండ్రులు చేతులు దులుపుకొంటున్నారని ఆరోపించారు. కానీ, విద్యార్థులను పర్యవేక్షించాలని సూచించారు. యుక్త వయసులో గంజాయికి అలవాటు పడితే.. వారి కుటుంబాల పరిస్థితి ఏంటో ఆలోచించాలని కోరారు. పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారని తనకు కొందరు ఫిర్యాదులు చేశారని.. కానీ, ఇలాంటి కేసుల్లో మరింత కఠినంగా వ్యవహరించాలని తాను సిఫార్సు చేశానని చెప్పారు.

గంజాయి సరఫరాదారులు, మాఫియా వివరాలు తన వద్ద ఉన్నాయన్నారు. వారి వివరాలను పోలీసులకు కావాలంటే ఇస్తానని చెప్పారు. అయితే.. వారిని అరెస్టు చేసే దమ్ము ఉందో లేదో.. పోలీసులు ఆలోచించుకోవాలని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇదిలావుంటే, అసెంబ్లీస్పీకర్‌గా ఉన్న అయ్యన్న పాత్రుడు తన వద్ద గంజాయి స్మగ్లర్ల జాబితా ఉందని ప్రకటన చేయడంతో పెను సంచలనంగా మారింది. దీనిపై టీడీపీ నాయకులే విస్తుబోతున్నారు. మరి ఆయన ఏ ఉద్దేశంతో అన్నారో అనేది చర్చనీయాంశంగా మారింది.

# వైసీపీ నేతల వరుస అరెస్టులు.. తాజాగా ముస్తఫా వంతు!



ఏపీలో వైసీపీ మాజీ ఎమ్మెల్యేల వరుస అరెస్టులు జరుగుతున్నాయి. అయితే.. వీరిలో కొందరు వ్యక్తిగత నేరాల జాబితాలో అరెస్టు అవుతుండగా.. మరికొందరు పొలిటికల్ ప్రదర్శిస్తున్న దూకుడు, ఘర్షణల కారణంగా అరెస్టు అవుతున్నారు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడి రోడ్డు ప్రమాద ఘటనను వేరేవారికి అంటగట్టే ప్రయత్నంలో అరెస్టయ్యారు. ఇక, మాజీ ఎంపీ మాధవ్.. పోలీసులపై సవాళ్లు రువ్వి అరెస్టు అయ్యారు. అలానే ప్రస్తుత ఎమ్మెల్యే విరూపాక్షి.. ఘర్షణలను రెచ్చగొట్టిన కేసులో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

**తాజాగా..**

గుంటూరు జిల్లాలోని తూర్పు నియోజకవర్గం మాజీ వైసీపీ ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫాను నూజివీడు పోలీసులు గుజరాత్‌లో అరెస్టు చేశారు. ఆయనతోపాటు.. ఆయన కుమారుడు బషీర్‌ను కూడా అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. వ్యాపారా లావాదేవీల నేపథ్యంలో ముస్తఫా కుమారుడు ఓ వ్యాపారి కుమారుడిని కిడ్నాప్ చేసి.. హింసించిన వ్యవహారంలో నూజివీడు పోలీసులు కేసు పెట్టారు. అప్పటి నుంచి తప్పించుకుని తిరుగుతన్న ముస్తఫాను.. గుజరాత్‌లో ఉన్నట్టు గుర్తించిన పోలీసులు అక్కడికి వెళ్లి అరెస్టు చేశారు.

**సింపతీ కోసం.. పాట్లు!**

మరోవైపు ఈ అరెస్టుల నుంచి సింపతీని పిండుకునేందుకు వైసీపీ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. విరూపాక్షి అరెస్టును బీసీ నేత అరెస్టుగా చిత్రీకరించి.. ప్రచారం చేసింది. ఇక, తాజాగా ముస్తఫా అరెస్టును మైనారిటీ నేత అరెస్టుగా ప్రొజెక్టు చేయడం గమనార్హం. రాష్ట్రంలో మైనారిటీలకు విలువ లేకుండా పో యిందని.. కూటమి ప్రభుత్వం మైనారిటీ వ్యతిరేక ప్రభుత్వమని వైసీపీ నాయకులు ప్రచారం చేస్తున్నారు. ఇక, విరూపాక్షి బోయ సామాజిక వర్గానికి చెందిననేత కావడంతో ఆయన అరెస్టును కూడా బీసీ ఖాతాలో వేసి.. బీసీలకు వ్యతిరేక ప్రభుత్వమని ప్రచారం చేయడం గమనార్హం.

**కర్నూలులో ఆరని మంటలు..**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో వైసీపీ వర్సెస్ టీడీపీ నేతల మధ్య రాజకీయ వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. మాజీ ఎమ్మెల్యేలకు, టీడీపీ నేతలకు మధ్య మాటల మంటలు రగులుతున్నాయి. విరూపాక్షి అరెస్టు.. అనంతరం జరిగిన ఘటనలపై టీడీపీ నేతలు నిరసన వ్యక్తం చేశారు. అయితే.. దీనికి ప్రతిగా వైసీపీ నాయకులు కూడా నిరసన పర్వం కొనసాగించడంతో పోలీసులు అలెర్ట్ అయ్యారు. జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ విధించారు.

## భయం వీడాలి!

జమ్మూ కశ్మీర్‌లో శాంతి ఎంత పెళుసుగా ఉందో మరోసారి రుజువైంది. జూలై 31న సాయంత్రం కుల్గాంలోని కేలం ప్రాంతంలో ఒక ఇటుక బట్టీ వద్ద పనిచేస్తున్న చత్తీస్‌గఢ్‌కు చెందిన ఇద్దరు వలస కార్మికులపై ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. దీపక్ అనే కార్మికుడు అక్కడికక్కడే మృతి చెందగా, గాయపడిన భూపేందర్ కుమార్‌ను అనంతనాగ్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలకు తరలించారు. ఈ దాడికి కేవలం రెండు రోజుల ముందు, పొరుగునే ఉన్న అనంతనాగ్‌లో ఐఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ ఆషిక్ హుస్సేన్ ఖురేషీని "షూట్ అండ్ స్కూట్" పద్ధతిలో దుండగులు కాల్చి చంపిన ఘటన కశ్మీర్‌ను కలవరపెట్టింది. ఈ దాడి వెనుక లష్కరే తొయిబాకు చెందిన ఒంటరి ఉగ్రవాది హస్తం ఉండొచ్చన్నది పోలీసుల అనుమానం. అయితే దీని ప్రభావం అంతకుమించి విస్తరించింది -పాత భయాలు మళ్లీ తలెత్తాయి, ప్రజా విశ్వాసం కుంగిపోయింది, అత్యంత బలహీనవర్గాలే లక్ష్యంగా మారాయి. లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఈ దాడిని "పిరికిపంద చర్య"గా అభివర్ణిస్తూ ఖండించారు, ఉగ్రవాదులను తుదముట్టించాలని భద్రతా బలగాలను ఆదేశించారు. వలస కార్మికుల నమోదు తప్పనిసరి చేయడం, యాజమాన్యాల ద్వారా బీమా సదుపాయం కల్పించడం, బాధితులకు గౌరవప్రదమైన అంత్యక్రియలు జరిపించడం వంటి చర్యలు అవసరమైనవే. అయితే, కేవలం బలప్రయోగంతోనే శాశ్వత శాంతిని సాధించలేమని కశ్మీర్ ఇటీవలి చరిత్రే చెబుతోంది.

లోయలో నిర్మాణ రంగం, ఉద్యానవన పరిశ్రమ, ఇటుక బట్టీలు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు -వీటన్నింటినీ నడిపిస్తున్నది వలస కార్మికులే. వేల కిలోమీటర్ల దూరంనుంచి కొద్దిపాటి వేతనం కోసం వచ్చే వీరు, తగినంత రక్షణ లేకుండా సులభమైన లక్ష్యాలుగా మిగిలిపోతున్నారు. వీరిపై దాడులు కేవలం క్రూరత్వ చర్యలు మాత్రమే కాదు -సాధారణ పరిస్థితులను చెడగొట్టి, భయాన్ని నాటి, మత సామరస్యాన్ని ఛిద్రం చేసేందుకు పథకం ప్రకారం జరిగే యత్నాలు! 2019లో ఆర్టికల్ 370 రద్దు తర్వాత వలస కార్మికులపై ఇలాంటి దాడులు పలుమార్లు జరిగాయి, ఆనాటినుంచి భయం, అభద్రతా భావం వారిని వెన్నాడుతూనే ఉన్నాయి. తాజా దాడుల నేపథ్యంలో భారీ భద్రతా స్పందన కనిపించింది. కార్డన్-అండ్-సెర్చ్ ఆపరేషన్లు, అదనపు బలగాల మోహరింపు, ఉగ్రవాద నిరోధక వ్యవస్థను మరింత పటిష్టం చేయడం వంటివి చేపట్టారు. ఈ బుధవారం.. ఆగస్టు 5న, జమ్మూ కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని కేంద్రం రద్దు చేసి, రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించి ఏడేళ్లు పూర్తవుతుంది. రాజకీయంగా సున్నితమైన తరుణంలో.. పూర్తి రాష్ట్ర హోదా పునరుద్ధరణకు నేషనల్ కాన్ఫరెన్స్ తన డిమాండ్‌ను మరింత తీవ్రతరం చేసింది. ఇది లోయ అంతటా విస్తృతంగా వ్యక్తమవుతున్న ఆకాంక్షే. ఈ నేపథ్యంలోనే, కుల్గాం, అనంతనాగ్ దాడుల "సమయం"పై నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా లేవనెత్తిన ప్రశ్నలు వివాదాస్పదమయ్యాయి. రాష్ట్ర హోదా వంటి రాజకీయ డిమాండ్లు ఊపందుకున్నప్పుడల్లా లక్షిత హత్యలు పెరుగుతాయని ఆయన వాదన. నిష్పక్షపాత దర్యాప్తు జరపాలన్న లెఫ్టినెంట్ గవర్నర్ పిలుపు సబబైనదే, తొందరపాటు నిర్ధారణలకు రావొద్దన్న ఆయన హెచ్చరిక కూడా వివేకవంతమైనదే. అయితే, ఉగ్రదాడుల చుట్టూ ఏ పక్షం నుంచి వచ్చే రాజకీయ ఊహాగానాలైనా, ధ్రువీకరణను మరింత తీవ్రతరం చేసి, ప్రాణాలను కాపాడాల్సిన తక్షణ కర్తవ్యం నుంచి దృష్టి మరల్చే ప్రమాదం ఉంది.

పోలీసింగ్, శాంతిభద్రతలపై నియంత్రణ కేంద్రం వద్దే ఉంచుకుంటూ, ఢిల్లీ తరహా నమూనాలో రాష్ట్ర హోదా పునరుద్ధరించే యోచనలో కేంద్రం ఉందని నివేదికలు సూచిస్తున్నాయి. అయితే ఈ ప్రతిపాదనను నేషనల్ కాన్ఫరెన్స్ తిరస్కరిస్తోంది. ఏ నమూనా అమలైనా, అనంతనాగ్, కుల్గాం దాడులను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోకూడదు. ఎన్నికైన నాయకులను బలహీనపరిచేందుకో, ప్రజాస్వామిక డిమాండ్లను తుంగలో తొక్కేందుకో ఉగ్రదాడులను రాజకీయం చేయకూడదు. అదే సమయంలో, సామూహిక అరెస్టులు, కూల్చివేతలు, విచక్షణారహిత నిర్బంధాలవంటి చర్యలు సమాజాలను దూరం చేసి, విశ్వాసాన్ని దెబ్బతీస్తాయి కాబట్టి అధికారులు కూడా వాటికి దూరంగా ఉండాలి. శాశ్వత శాంతికి లక్షిత ఉగ్రవాద నిరోధక చర్యలతోపాటు, సమాజ అనుకూల పోలీసింగ్ అవసరం. వలస కార్మికులకు సురక్షిత వసతి, రవాణా సదుపాయాలు, తక్షణ స్పందన బృందాలు, సంబంధిత అధికారుల నియామకం చేయాలి. దర్యాప్తులు వేగంగా, పారదర్శకంగా, తప్పుడు సమాచార ప్రచారానికి తావివ్వకుండా జరగాలి. రాజకీయ నాయకులు హింసను ముక్తకంఠంతో ఖండించాలి, బాధిత కుటుంబాలకు అండగా నిలవాలి, విషాదాన్ని సొంత ప్రయోజనాలకు వాడుకోవడం మానుకోవాలి. జమ్మూ కశ్మీర్ ఈరోజు ఒక కీలక మలుపులో నిలిచి ఉంది. రాజ్యాంగపరమైన మార్పులు దాని రాజకీయ ముఖచిత్రాన్ని మార్చాయే తప్ప, ప్రజల ఆకాంక్షలను చెరిపేయలేకపోయాయి. అర్థవంతమైన రాష్ట్ర హోదా పునరుద్ధరణ, ఎన్నికైన సంస్థలకు అధికారం కల్పించడం, పరిపాలనా-భద్రతా బాధ్యతలను స్పష్టం చేయడం -విశ్వాసాన్ని పునర్నిర్మించేందుకు ఇవి తప్పనిసరి. కేవలం రాష్ట్ర హోదా ఒక్కటే శాంతిని తీసుకురాలేదు. స్థానికులు, వలస కార్మికులు భయం లేకుండా జీవించగలగడం, పర్యాటకులు సురక్షితంగా భావించడం, భద్రతా సిబ్బంది ఉగ్రదాడుల నుంచి రక్షితంగా ఉండటం -ఇవన్నీ కలిస్తేనే నిజమైన శాంతి సాధ్యమవుతుంది. కశ్మీర్ లోయ హింస, రాజకీయ దోపిడీ నుంచి బయటపడాలి. రాష్ట్ర హోదా ఏరూపంలో వచ్చినా, కశ్మీర్‌కు అవసరమైనది సమ్మిళిత రాజకీయాలు, పటిష్టమైన భద్రత, ఐక్యత మాత్రమే. హంతకులకు న్యాయస్థానంలో శిక్ష పడాలి, ప్రజలను కరుణతో, దూరదృష్టితో కాపాడాలి. ఏడేళ్ల తర్వాత కూడా కశ్మీర్ ప్రజలు ఎదుర్కొంటున్న అభద్రతా భావం, పాలనలో పరిష్కారం కావాల్సిన ప్రశ్నలు ఇంకా మిగిలే ఉన్నాయని ఈ దాడులు గుర్తుచేస్తున్నాయి. రాజకీయ చర్చలు ఎంత తీవ్రంగా సాగినా, సామాన్య ప్రజల భద్రతను త్యాగం చేయకూడదు. ప్రతి వలస కార్మికుడి ప్రాణం, ప్రతి భద్రతా సిబ్బంది ప్రాణం దేశానికి సమానంగా విలువైనదని పాలకులు గుర్తుంచుకోవాలి. కశ్మీర్‌లో శాశ్వత శాంతి సాధించాలంటే, భద్రతా బలగాలు, పౌర సమాజం, రాజకీయ పక్షాలు ఉమ్మడిగా బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉంది. భయం స్థానంలో విశ్వాసం నెలకొన్నప్పుడే, లోయలో నిజమైన అభివృద్ధి, సామరస్యం సాధ్యమవుతాయి.

---

### పనికొచ్చే పలుకు




## వర్తమానమే.. అసలు జీవితం!

ఓవర్‌థింకింగ్ అంటే వాస్తవం కాని ఒక కల్పిత కథను మనసులో అల్లుకోవడమే. "ఇలా జరిగితే ఎలా? అలా విఫలమైతే ఏంటి?" అనే ప్రశ్నలు మనసులో మాత్రమే పుట్టేవి, వాస్తవానికి అవి ఇంకా జరగనేలేదు. అయినా, ఈ ఊహాజనిత భయాలు మన శరీరంలో నిజమైన ఒత్తిడిని సృష్టిస్తాయి. గుండె వేగంగా కొట్టుకుంటుంది, నిద్ర దూరమవుతుంది, మనసు అల్లకల్లోలంగా మారుతుంది -అంతా ఒక ఊహ కోసం మాత్రమే! ఇది ఆధునిక జీవనశైలిలో అత్యంత సాధారణమైన మానసిక ఉచ్చు. చిన్న విషయాన్ని పదే పదే మననం చేసుకుంటూ, దానికి కొత్త కొత్త కోణాలు, ఊహించని పర్యవసానాలు జోడిస్తూ, అసలు సమస్య కంటే మన ఆలోచనల భారమే మనల్ని అలసిపోయేలా చేస్తుంది.

మనిషి మనసు సహజంగా రెండు దిక్కులవైపు పరుగెడుతుంటుంది -గతం వైపు, భవిష్యత్తు వైపు. గతం గురించి ఆలోచిస్తే పశ్చాత్తాపం, అపరాధ భావన మిగులుతాయి; భవిష్యత్తు గురించి ఆలోచిస్తే ఆందోళన, భయం చుట్టుముడతాయి. కానీ వర్తమానం మాత్రమే మనం నిజంగా జీవించగలిగే క్షణం. ఈ క్షణంలో ఏం జరుగుతుందో దానిపైనే మన నియంత్రణ ఉంటుంది. గతాన్ని మార్చలేం, భవిష్యత్తును ముందుగానే నిర్ణయించలేం. అందుకే ఆలోచనలు గతం లేదా భవిష్యత్తువైపు పరుగెత్తినప్పుడల్లా, ఊపిరి తీసుకుంటూ, చుట్టూ ఉన్న వాస్తవ ప్రపంచాన్ని గమనిస్తూ, మనల్ని మనం బలవంతంగానైనా వర్తమానానికి తీసుకురావాలి. ఇది ఒక్కసారితో అయ్యే పని కాదు, నిత్యం అభ్యసించాల్సిన మానసిక క్రమశిక్షణ. ఈ అలవాటు మనిషి జీవనశైలిని సమూలంగా మార్చగలదు. నిర్ణయాలు తీసుకోవడంలో స్పష్టత పెరుగుతుంది, ఎందుకంటే భయం నుంచి కాకుండా వాస్తవం నుంచి ఆలోచించడం మొదలవుతుంది. సంబంధాల్లో నిజాయితీ పెరుగుతుంది, ఎందుకంటే అనవసర అనుమానాలు, ఊహాజనిత అపార్థాలు తగ్గిపోతాయి. పని విషయంలో ఉత్పాదకత మెరుగుపడుతుంది. ఎందుకంటే శక్తినంతా ఆలోచనల్లో వృథా చేయకుండా, చేతిలో ఉన్న పనిపై కేంద్రీకరించగలుగుతారు. అంతేకాదు, శారీరక ఆరోగ్యంపై కూడా సానుకూల ప్రభావం పడుతుంది. దీర్ఘకాలిక ఒత్తిడి తగ్గడం వల్ల రక్తపోటు, నిద్రలేమివంటి సమస్యలు కూడా క్రమేణా తగ్గుముఖం పడతాయి. చిన్న విషయాలను పెద్దవిగా చేసుకోవడం మానేసినప్పుడు, జీవితం తేలికగా, ఆనందదాయకంగా అనిపిస్తుంది.

ప్రఖ్యాత రచయిత మార్క్ ట్వేన్ చెప్పిన మాటలు ఈ సందర్భంలో గుర్తుచేసుకోదగినవి. "నా జీవితంలో ఎదుర్కొన్న చాలా భయాలు, వాస్తవానికి ఎప్పుడూ నిజం కాలేదు" అని ఆయన ఒక సందర్భంలో పేర్కొన్నారు. అంటే మనం భయపడే విషయాల్లో అత్యధిక శాతం కేవలం మన ఊహల్లోనే మిగిలిపోతాయి తప్ప, వాస్తవంలో సంభవించవు. ఇదే భావాన్ని పురాతన తెలుగు నీతి పద్యాలు కూడా ప్రతిబింబిస్తాయి -"జరిగినది మార్చలేము. జరగనిది తెలియదు. జరుగుతున్నదే జీవితం" అనే భావన శతకకారుల బోధనల్లో పలుమార్లు కనిపిస్తుంది. వర్తమానంలో నిలబడి, ప్రశాంతంగా జీవించడమే నిజమైన జ్ఞానమని పెద్దలు చెప్పిన మాట నేటికీ వర్తిస్తుంది.

కాబట్టి, మనసు గతం వైపో భవిష్యత్తు వైపో పరుగెత్తినప్పుడల్లా, ఒక్క క్షణం ఆగి, "ఇప్పుడు నేను ఎక్కడ ఉన్నాను, ఏం చేస్తున్నాను" అని తనను తాను ప్రశ్నించుకోవడం అలవాటు చేసుకోవాలి. ఇది చిన్న అలవాటే అయినా, దీర్ఘకాలంలో మనశ్శాంతిని, స్పష్టతను, ఆత్మవిశ్వాసాన్ని పెంచే శక్తివంతమైన సాధనంగా మారుతుంది. ఓవర్‌థింకింగ్ అనే ఊహాజనిత కథను వదిలేసి, వర్తమానమనే వాస్తవ జీవితాన్ని స్వీకరించడమే నిజమైన మానసిక ఆరోగ్యానికి తొలి అడుగు.

-మహాదేవ

---

# చదువుల చెద.. గిట్టెదెప్పుడు!




భారత విద్యా వ్యవస్థ గాడి తప్పిందని చెప్పక తప్పదు. ప్రశ్నాపత్రాల లీకేజీలు కఠిన శిక్షలతో ఆగేవి కావు. నిజంగా అవసరమైనది భావజాల పక్షపాతానికి తావు లేకుండా వ్యవస్థను సమూలంగా సంస్కరించడమే. పేపర్ లీకేజీలు భారత్‌లో ఏటా జరిగే ఒక పరిపాటి అంశమైంది; ప్రభుత్వ దశాబ్దాల నిర్లక్ష్యానికి, ప్రజా పరీక్షల నిర్వహణలో అవగాహనారాహిత్యానికి బాధితులు ప్రతిచోటా కనిపిస్తున్నారు. బిహార్‌లో రైల్వే రిక్రూట్‌మెంట్ పరీక్ష గందరగోళానికి గురైనప్పుడు, బాధిత యువత రైలు బోగీలకు నిప్పంటించారు, పట్టాలను దిగ్బంధించారు, రాళ్లు రువ్వారు. కేవలం 35 వేల ఉద్యోగాల కోసం కోటిమందికి పైగా అభ్యర్థులు పరీక్ష రాశారు. నెలకు రూ.20 వేల ప్రారంభ వేతనంతో శాశ్వత ఉద్యోగం దక్కించుకునేందుకు. బిహార్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, హర్యానా, తెలంగాణల్లో యువత సాయుధ బలగాల నియామకంలో నిబంధనలు మార్చిన "అగ్నిపథ్" పథకంపై ఆగ్రహావేశాలతో వీధుల్లోకి వచ్చారు. ఇదంతా మోదీ ప్రభుత్వానికి తెలియదని అనుకోలేం. అయితే, పేపర్ లీకేజీలకు పరిష్కారం చిన్న దళారులపై కఠినమైన శిక్షలు విధించడంలో లేదు. వారెప్పుడూ దొరికిపోయే చిన్న చేపలే! పేపర్ లీకేజీ వ్యాపారం భారీస్థాయిలో సాగుతోంది, హీనపక్షం రూ.1,000 కోట్ల విలువైన వ్యాపారం. ఇంతటి భారీ వ్యాపారానికి రూ.10 కోట్ల జరిమానా అనేది కేవలం చిల్లర ఖర్చే.. సులభంగా భరించగలిగేదే!

అసలు సమస్య "వ్యవస్థ"లోనే ఉంది; ప్రతీకాత్మక చర్యలతో పరిష్కారం లభించదు. ప్రజా పరీక్షల సందర్భంలో విద్య -అది అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రవేశాల కోసమైనా, లేదా దేశంలో అత్యంత భద్రమైన ఉద్యోగాలైన ప్రభుత్వ ఉద్యోగాల నియామకం కోసమైనా -ఒక తీవ్రమైన పోటీగా మారిపోయింది. "పరీక్ష క్రాక్" చేయడం కోసం సాగే ఈ హోరాహోరీ పోరు విద్యను ఒక వాణిజ్య వస్తువుగా మార్చేసింది. దీని ఫలితంగా, విజయం సాధించాలన్న డిమాండ్‌ను తీర్చేందుకు లీకైన ప్రశ్నాపత్రాల సరఫరా వ్యవస్థతో కూడిన ఒక మార్కెట్టే ఏర్పడింది. జాతీయ విద్యా విధానం, చరిత్ర-సైన్స్ పాఠ్యాంశాల్లో మార్పులు, పాత సంస్థలను కూల్చివేసి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీవంటి పూర్తిగా విశ్వసనీయత లేని కొత్త వ్యవస్థలను తీసుకురావడం -ఇవన్నీ విద్యార్థులను ఆశ్చర్యానికి గురిచేస్తూ లీకేజీలకు కారణమవుతూ, పరీక్షల మాఫియాకు లాభాలు తెచ్చిపెడుతూనే ఉన్నాయి. ఇవి సమస్యను మరింత దుర్గంధభరితం చేస్తున్నాయే తప్ప, పరిష్కారాలు కావు. మధ్యాహ్న భోజన మెనూలో సాత్విక ఆహారం వర్సెస్ మాంసాహారం వంటి చర్చలు కూడా, పాఠశాలల్లో ప్రభుత్వం అందించే భోజనం అసలు లక్ష్యాన్ని నెరవేర్చడంలో విఫలమవుతున్నాయి. మార్చాల్సినదేమిటో విద్యార్థులకు తెలుసు, విద్యావేత్తలు, నిపుణులకూ తెలుసు -తెలియనిది ప్రభుత్వానికి మాత్రమేనని స్పష్టమవుతోంది. తల్లిదండ్రుల మాదిరిగా వ్యవహరించే రాజకీయ వర్గం ఎంత దయనీయంగా ఉందంటే, జెన్-జెడ్, జెన్-ఆల్ఫా తరాలు తమ కోసం తామే నిలబడాలని గ్రహిస్తున్నాయి -లేకుంటే ఏఐ గురించి మాట్లాడే రాజకీయ నాయకత్వం, ఏఐ ప్రపంచాన్ని ఎదుర్కొనేలా యువతను సన్నద్ధం చేయడంలో మాత్రం విఫలమవుతూ, వారిని బస్సు కింద తోసేస్తుంది. 15-29 వయసుగల 30.7 కోట్లమంది యువత శ్రామిక మార్కెట్‌లోకి ప్రవేశించగా, 14.1 కోట్ల మంది మాత్రమే శ్రామిక శక్తిలో ఉన్నారు; 12.7 కోట్ల మంది "ఉపాధి" పొందినట్టు కనిపించినా, కేవలం ఎనిమిదో వంతు మందికి మాత్రమే -అంటే 1.5 కోట్లమందికి మాత్రమే ఒప్పంద ఆధారిత, సామాజిక భద్రతతో కూడిన, గౌరవప్రదమైన పని పరిస్థితులు, న్యాయమైన వేతనం, కెరీర్ అవకాశాలున్న శాశ్వత జీతభత్యాల ఉద్యోగాలు దక్కుతున్నాయి. మరోలా చెప్పాలంటే, యువతలో నాలుగో వంతు (25.7 శాతం) కుటుంబ పనుల్లో ఉచితంగా శ్రమిస్తున్నారు, 21.3 శాతం "సొంత ఖాతా పని"లో నిమగ్నమై ఉండగా, 22 శాతం తాత్కాలిక పనుల్లో, 18 శాతం సామాజిక భద్రత లేని క్రమబద్ధ ఉద్యోగాల్లో ఉన్నారు, కేవలం 11.8 శాతంమందికి మాత్రమే సామాజిక భద్రతతో కూడిన ఉద్యోగాలు లభిస్తున్నాయి.

వైద్యం, ఇంజినీరింగ్, న్యాయవాద, అకౌంటెన్సీ వంటి రంగాల్లో డిగ్రీలు -విద్యార్థులు, వారి కుటుంబాలు మెరుగైన జీవన నాణ్యత కోసం చేసే పెట్టుబడులు. అయితే, ఈ పెట్టుబడికి ఎలాంటి హామీ లేదని ఆ కుటుంబాలకూ తెలుసు. అర్హత సాధించిన యువత తమ పెట్టుబడికి తగిన ఉద్యోగాలు దక్కించుకోకపోవచ్చు. ఏఐ సాంకేతికతలను స్వీకరించి, వాటికి అనుగుణంగా మారగలిగే ఆర్థిక వ్యవస్థకు అవసరమైన సామర్థ్యాలను నిర్మించే సంస్కరణలు విద్యా రంగానికి కావాలి, వేద గణితం తరహా భావజాల సంస్కరణలు కాదు. ప్రైవేటు పెట్టుబడులను లాభదాయక మార్గంగా ప్రోత్సహించడం కాకుండా, ఏఐ సాంకేతికతలతో మారుతున్న శ్రామిక శక్తిలో చేరగలిగే యువతను తీర్చిదిద్దేందుకు భారీ ప్రభుత్వ పెట్టుబడులు అవసరం. ఆకాంక్షలకు, అవకాశాలకు మధ్య అంతరాన్ని గుర్తించాలి -తగిన వేతనంతో కూడిన పని అవకాశాల తీవ్ర కొరత కారణంగా, ప్రతిభావంతులైన యువత తీవ్రమైన నిరాశకు గురవుతున్నారు. నీట్ ప్రక్రియ అనర్హులుగా భావించే వారిని మినహాయించే ఒక పరీక్ష -ప్రతిభతో సంబంధం లేకుండా, పరీక్షకు హాజరైన వ్యక్తి, కుటుంబం కలలను ధ్వంసం చేయగల ఒక అనిశ్చిత సంఘటన. ఉద్యోగ నియామక పరీక్షలు కూడా అర్హులను మిగిలిన వారినుంచి వేరు చేసే ఒక పద్ధతే. రెండు సందర్భాల్లోనూ, వైద్య కళాశాలల్లో సీట్లు, ప్రభుత్వ శాశ్వత ఉద్యోగాల సంఖ్య అభ్యర్థుల సంఖ్యతో పోలిస్తే తీవ్రంగా అసమతుల్యంగా ఉంది. 35 వేల తక్కువ వేతన, భవిష్యత్తులేని ఉద్యోగాల కోసం కోటిమందికి పైగా అభ్యర్థులు పోటీపడుతున్నారు. విద్య, ఆరోగ్యంలో పెట్టుబడి పెట్టనంత కాలం భారత్ "వికసిత్ భారత్" లక్ష్యాన్ని త్వరలో సాధించలేదన్నది వాస్తవం. చైనా ఈ పెట్టుబడిని 1950ల్లోనే ప్రారంభించింది; భారత్ చేస్తున్నామని చెప్పుకున్నా, ఆచరణలో విఫలమైంది. 15 ఏళ్లలోపు పిల్లలకు మాత్రమే విద్యను ప్రాథమిక హక్కుగా చేయడానికి 2009 వరకు పట్టింది. తరగతి గదులు డిజిటల్‌గా మారుతున్నాయని, ఏఐ ఆధారిత అభ్యాసం అందుబాటులోకి వస్తుందని ఎంత గొప్పగా చెప్పుకున్నా, విద్యా వ్యవస్థ ఇప్పటికీ నిరాశాజనకంగానే మిగిలిపోయింది; ఉపాధ్యాయుల సామర్థ్యం, పరీక్షలు, పాఠ్యాంశాలు కాలం చెల్లినవిగానే ఉన్నాయని జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపిన విద్యార్థులే స్వయంగా చెప్పారు. రిక్రూట్‌మెంట్ పరీక్షల్లో అర్హత ప్రమాణాలు, తదనంతర హింసాత్మక నిరసనల చరిత్ర గతంలోనూ పలుమార్లు కనిపించింది. పీహెచ్‌డీ చేసిన నిరుద్యోగ యువత కూడా, కేవలం ఎనిమిదో తరగతి ఉత్తీర్ణత అవసరమైన పారిశుద్ధ్య కార్మికుల ఉద్యోగాల కోసం పరీక్షలు రాయాల్సిన దుస్థితి నెలకొంది. కఠిన చట్టాన్ని తీసుకురావడం మాత్రమే సమస్యకు పరిష్కారం కాదు; హామీలను నెరవేర్చేందుకు అవసరమైన లోతైన అవగాహన, నిబద్ధత లేకపోతే, ఎంతటి కఠిన శిక్షలు అమలు చేసినా భారత విద్యా వ్యవస్థ కుళ్లు తొలగదు! ■

---



బంధంలో ఇచ్చిపుచ్చుకోవడాలు బేరీజు వేసుకుంటే, ప్రేమ వ్యాపారంగా మారిపోతుంది. నిజమైన సహచర్యం ఉండాలంటే, "నాకేం దక్కింది" అనే ఆలోచన నుంచి "నేనేం అందించగలను" అనే దృక్పథానికి మారాలి. జీవిత భాగస్వామి కోరికలను, అవసరాలను మన స్వంతం కంటే ముందు పెట్టినప్పుడే, ఆ బంధంలో నిజమైన బలం చిగురిస్తుంది. "నేను ఇంత త్యాగం చేశాను, మరి నువ్వేం చేశావు" అనే లెక్కలు మొదలైతే, ప్రేమ స్థానంలో పోటీతత్వం చోటుచేసుకుంటుంది. అవతలి వ్యక్తి కళ్లలో మెరుపు చూడాలన్న తపననే మన కర్తవ్యంగా భావించినప్పుడు, ఆ చిరునవ్వు మనకు రెట్టింపు ఆనందాన్నిస్తుంది. ఇచ్చే గుణమే బంధాన్ని జీవితాంతం నిలబెడుతుంది, తీసుకోవాలనే ఆరాటం కాదు.

-మహాదేవ

---

### వింతల్లో వింతలు

## నెలవరకూ ఉతకక్కర్లేదట!



ఒక నెల రోజులు వరకూ ఉతకాల్సిన అవసరం లేని టీ-షర్టును అమెరికన్ దుస్తుల సంస్థ 'హర్క్‌లియాన్' తయారు చేసింది. గతంలో స్వీయ-శుభ్రతగల లోదుస్తులతో వైరలైన ఈ కంపెనీ, తాజాగా 'హర్క్‌షర్ట్ వి5.0' పేరుతో ఐదో వెర్షన్ టీ-షర్టును విడుదల చేసింది. వేసవిలో ఎంత చెమటపట్టినా, నెల రోజులపాటు ధరించినా దుర్వాసన రాదని కంపెనీ చెబుతోంది. దీని వెనుక రహస్యం -రాగి, వెండి, జింక్, బంగారం, అగ్నిపర్వత బూడిద సహా ఏడు ప్రత్యేక పదార్థాలను దుస్తు ఉపరితలంపై కాకుండా, నేతలోనే కలిపి తయారు చేయడం. రాగి బ్యాక్టీరియాను అడ్డుకుంటే, జింక్ చెమట వాసనను తటస్థీకరిస్తుంది, అగ్నిపర్వత బూడిద తేమను శోషించుకుంటుంది. ధర 79 డాలర్లు అయినా, ఏడు సాధారణ టీ-షర్టులకు సమానమని కంపెనీ వాదన. నవంబర్‌లో మార్కెట్లోకి రానున్న ఈ షర్టు తొలుత నలుపు రంగులోనే లభించనుంది.

# ఈ ఐదు హ్యాబిట్స్ మీకు ఉంటే..
# మంచి ఆరోగ్యం సొంతం


## నిత్యం వ్యాయామాలు చేయాల్సిందే
## పోషకాహారం తీసుకోవాలి
## ప్రతి రోజూ 7-9 గంటల పాటు నాణ్యమైన నిద్ర
## ఒత్తిడి ఎక్కువ కాకుండా చర్యలు తీసుకోవాలి



ఆరోగ్యంగా ఉండాలని కోరుకోని వారు ఉండరు. కానీ, మిగతా విషయాల పట్ల ఉన్న శ్రద్ధ ఆరోగ్యం విషయంలో చూపించరు. దీంతో క్రమంగా ఆరోగ్యానికి నష్టం జరుగుతుంటుంది. నడి వయసుకే ఎన్నో ఆరోగ్య సమస్యలు మొదలవుతుంటాయి. సాధారణంగా 60 ఏళ్లు దాటిన వారికి వృద్ధాప్యంలో అనారోగ్య సమస్యలు రావడం సహజం. కానీ 30-40 ఏళ్లకే ఆరోగ్యం విషయంలో సమస్యలు రావడం అంటే కచ్చితంగా శ్రద్ధ తీసుకోవాల్సిందే. 30-40 ఏళ్లకే వృద్ధాప్యపు ఛాయలు రాకూడదని కోరుకుంటే, 50 ఏళ్లు దాటినా నడి వయసు వారి మాదిరే యవ్వనంగా కనిపించాలంటే అదేమీ పెద్ద కష్టమైన విషయం కాదు. కాకపోతే కొన్ని చర్యలను పాటించాల్సి ఉంటుంది. వృద్ధాప్యంలో కణాలు దెబ్బతినడం, క్షీణించడం మొదలవుతుంది. కణాల మధ్య మెరుగైన కమ్యూనికేషన్ ప్రక్రియ బలహీనపడుతుంది. కొన్ని చర్యల ద్వారా ఈ ప్రక్రియలను నిలువరించామంటే యవ్వనంగా ఉండొచ్చు.
రోజువారీ వ్యాయామాలు జీవన విధానంలో భాగం చేసుకోవాలి. వారంలో కనీసం ఐదు రోజుల పాటు, రోజుకు 30-45 నిమిషాల పాటు చేయాల్సి ఉంటుంది. వాకింగ్, జాగింగ్, రన్నింగ్, స్విమ్మింగ్, ఏరోబిక్ వ్యాయామాలు, జిమ్ లో కసరత్తులు ఏవైనా కావచ్చు. ముఖ్యంగా గుండె బలపడడానికి వ్యాయామాలు ఉంటాయి. వాటిని కూడా చేయాలి.
ఆహారానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి. ఏదో ఒకటి లేదంటే రుచికరమైనది తినేశామంటే కుదరదు. తీసుకునే ఆహారం ఏదైనా కానీ, అందులో పోషకాలు ఉండాలి. ముడి ధాన్యాలు, తృణ ధాన్యాలు, కూరగాయలు, ఆకుపచ్చని కూరగాయలు తీసుకోవాలి. అదే సమయంలో చక్కెరలు, ప్రాసెస్డ్ ఫుడ్స్, స్నాక్స్ తీసుకోకూడదు.
ఇక నాణ్యమైన నిద్ర చాలా అవసరం. రోజులో 7 నుంచి 9 గంటల వరకు నిద్ర పోవచ్చు. కాకపోతే ఈ నిద్ర కూడా కలత నిద్ర అవ్వకూడదు. అవాంతరాల్లేని నాణ్యమైన, గాఢనిద్ర అవ్వాలి. ఇందు కోసం నిద్రకు గంట ముందు నుంచి ఎలక్ట్రానిక్ ఉపకరణాలను వినియోగించకూడదు. పడకగదిలో వెలుతురు లేకుండా చూసుకోవాలి. నిద్రకు, రాత్రి భోజనానికి మధ్య 2 గంటల విరామం ఉండాలి.
ఒత్తిడి లేకుండా చూసుకోవడం కూడా ఆరోగ్యం పరంగా అత్యంత అవసరం. ఒత్తిడి ఎక్కువైపోతే కణాలకు నష్టం జరుగుతుంది.
మధుమేహం, బీపీ, కేన్సర్, గుండె జబ్బుల వంటి సమస్యలు స్ట్రెస్ వల్ల వస్తాయని ఎన్నో అధ్యయనాల్లో వెల్లడైంది. ఆదుర్దాగా కాకుండా కాస్త నిదానంగా పనులు చేసుకోవడం, సమయానికి ముందుగానే బయల్దేరడం, మెడిటేషన్, యోగాసనాలు స్ట్రెస్ నుంచి విముక్తి కల్పిస్తాయి.
ఇక సామాజిక సంబంధాలు కూడా మన ఆరోగ్యం విషయంలో ప్రభావం చూపిస్తాయి. మంచి స్నేహితులతో, కుటుంబ సభ్యులతో తగినంత సమయం గడపాలి.

# కిడ్నీల ఆరోగ్యానికి మంచి నీళ్ల సాయం... అంతా ఇంతా కాదు!

### జీవరాశి మనుగడకు కీలకంగా ఉన్న మంచినీరు
### శరీరంలో నీటి శాతం తగ్గకుండా చూసుకోవాలంటున్న నిపుణులు
### తగినంత నీరు తాగకపోతే యూరిక్ యాసిడ్ పేరుకుపోయే ప్రమాదం
### కిడ్నీలో రాళ్లు, గౌట్ వంటి సమస్యలకు ప్రధాన కారణం యూరిక్ యాసిడ్



భూమిపై జీవానికి ప్రాణాధారం నీరు. మనిషి ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో కీలకపాత్ర నీటిదే. ముఖ్యంగా కిడ్నీల పనితీరుకు తోడ్పాటు అందిస్తూ మంచి నీరు అత్యంత ప్రముఖ పాత్ర పోషిస్తుంది. అయితే, నీళ్లు కిడ్నీల ఆరోగ్యాన్ని ఎలా కాపాడతాయో చూద్దాం!
మానవ దేహంలోని వ్యర్థాలు మలమూత్రాల రూపంలో విసర్జితమవుతాయని తెలిసిందే. మూత్రం ద్వారా యూరిక్ యాసిడ్ వంటి ఘాటైన పదార్థాలు బయటికి పోతాయి. కొన్నిరకాల పదార్థాలు తిన్నప్పుడు, కూల్ డ్రింక్స్, మద్యం సేవించినప్పుడు శరీరంలో యూరిక్ యాసిడ్ అధిక మొత్తంలో పేరుకుపోతుంది. దీన్ని బయటికి పంపించే పని కిడ్నీలదే.
అయితే నీరు తక్కువగా తాగడం వల్ల శరీరంలో పెరిగిపోయిన యూరిక్ యాసిడ్ నిల్వలను కిడ్నీలు పూర్తిగా విసర్జించలేవు. దాంతో కిడ్నీలో రాళ్లు, గౌట్ వంటి కీళ్ల సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఇలాంటి సమస్యలతో వైద్యుల వద్దకు వెళితే, వారు వీలైనంత అధికంగా మంచినీళ్లు తాగమనే చెబుతారు. మంచినీళ్లు తాగడం వల్ల రక్తంలోని యూరిక్ యాసిడ్ పల్చబడుతుంది. అప్పుడది కిడ్నీల ద్వారా వడపోతలకు గురై వ్యర్థాలు మూత్రం ద్వారా వెలుపలికి వచ్చేస్తాయి. నీళ్లు సరిగా తాగకపోతే, మూత్రం మరింత గాఢతను సంతరించుకుంటుంది . కిడ్నీలు యూరిక్ యాసిడ్ ను వడపోయడంలో సమర్థవంతంగా పనిచేయలేవు. అలాంటప్పుడు యూరిక్ యాసిడ్ శరీరంలో అధిక మొత్తంలో పోగుపడుతుంది. అది ఘనీభవించి రాళ్లుగా మారుతుంది. ఇతర అనారోగ్య సమస్యలు కూడా మొదలవుతాయి.
శరీరంలో యూరిక్ యాసిడ్ అధికంగా ఉత్పత్తికావడానికి పలు కారణాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ఒబేసిటీతో బాధపడుతున్న వారిలో యూరిక్ యాసిడ్ స్థాయిలు అధికంగా ఉంటాయని తెలిపారు. మంచినీళు ఎక్కువగా తాగకపోవడం వల్ల ఆరోగ్యకరమైన శరీర బరువును కొనసాగించలేరని, ఇలాంటివాళ్లు బరువు పెరగడమో, ఊబకాయులుగా మారడమో జరుగుతుందని,
దాంతో యూరిక్ యాసిడ్ తో కలిగే సమస్యల బారినపడుతుంటారని నిపుణులు వివరించారు. లేకపోతే కిడ్నీలపై విపరీతమైన భారం పడుతుందని, క్రమంగా ఇది కిడ్నీల వైఫల్యానికి దారితీస్తుందని వివరించారు. ఇలాంటి సమస్యల బారినపడకూడదనుకుంటే అందుకు నీళ్లే ఔషధం అని స్పష్టం చేశారు. నీళ్లు కిడ్నీల పనితీరునే కాకుండా, విషపదార్థాల ఏరివేతలో సహాయపడే కాలేయానికి తోడ్పాటునందిస్తాయని తెలిపారు. శరీరంలో హానికర పదార్థాల వడపోతకు సహకరించే ఏ అవయవానికైనా మంచి నీళ్లే మంచి మిత్రుడు అనొచ్చని పేర్కొన్నారు.



# మెదడు భళా

మెదడు ఆరోగ్యం కేవలం వైద్యపరమైన అంశం కాదు.. సామాజిక, ఆర్థిక అవసరం కూడా. స్పష్టంగా, చురుకుగా ఆలోచించటం, సమర్థంగా నేర్చుకోవటం, ముఖ్యమైన సమాచారాన్ని గుర్తుంచుకోవటం, జీవితాన్ని సంపూర్ణంగా ఆస్వాదించటం.. అన్నీ దీంతో ముడిపడినవే. చదువుకోవటం, పనులు, ఉద్యోగాలు చేయటం, కుటుంబ సంరక్షణ, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనటం, భావోద్వేగ నియంత్రణ, మానసిక దృఢత్వం వంటివన్నీ దీని చలవే. అందుకే మెదడును ఆరోగ్యంగా ఉంచుకోవటం అత్యవసరం. ఇది ఏదో ఒక రోజులో దక్కేది కాదు. ఏదో ఒక వయసుకో పరిమితం కాదు. నిరంతరం ప్రయత్నించాల్సిందే. జీవితాంతమూ కాపాడుకోవాల్సిందే.

**చెమటోడ్చాలి**

శరీరమే కాదు, మెదడు ఆరోగ్యంగా ఉండటానికీ వ్యాయామం అవసరం. దీంతో మెదడుకు రక్త సరఫరా పెరిగి బుద్ధి కుశలత, మానసిక సామర్థ్యం ఇనుమడిస్తాయి. వారానికి కనీసం 150 నిమిషాల సేపు వ్యాయామం చేయాలి. అంత సమయం దొరకటం లేదంటే 10 నిమిషాల చొప్పున విభజించుకొని రోజంతా అప్పుడప్పుడు చేయొచ్చు. గుండె, శ్వాస వేగం పెంచే ఏరోబిక్ వ్యాయామాలు (వేగంగా నడవటం వంటివి) మేలు. వీలైతే తీవ్ర వ్యాయామాలూ చేయొచ్చు. ఇవైతే వారానికి కనీసం 75 నిమిషాలు చేసినా చాలు. వ్యాయామంతో అల్జీమర్స్ జబ్బు ముప్పు సైతం తగ్గుతుంది.

**తలను కాపాడుకోవాలి**

మెదడుకు పుర్రె రక్షణ కవచం. దీన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలి. మెదడుకు గాయమైతే ఆలోచన, జ్ఞాపకశక్తి, సమన్వయం, మాట, భావోద్వేగాలు గణనీయంగా మారిపోతాయి. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్, కారు నడిపేవారు సీటు బెల్టు ధరించాలి. తలకు గాయాలయ్యే అవకాశం గల క్రికెట్ వంటి ఆటలు ఆడేటప్పుడూ విధిగా హెల్మెట్ పెట్టుకోవాలి. మెట్లు, నిచ్చెన ఎక్కేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి. ఇంట్లో వస్తువులు నేల మీద చిందరవందరగా పడేయకుండా చూసుకోవాలి.

**ఆరోగ్యం మీద కన్ను**

మధుమేహం, అధిక రక్తపోటు, గుండెజబ్బుల వంటివి ఆలోచన, జ్ఞాపకశక్తి తగ్గటానికీ దారితీస్తుంటాయి. పక్షవాతం ముప్పు పెరిగేలా చేస్తుంటాయి కూడా. కాబట్టి ఇలాంటి సమస్యల విషయంలో నిర్లక్ష్యం తగదు. క్రమం తప్పకుండా డాక్టర్‌ను సంప్రదిస్తూ, అవసరమైన మందులు విధిగా వేసుకోవాలి. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలి. విషయగ్రహణ సామర్థ్యాన్ని దెబ్బతీసే జబ్బులను ముందుగానే పట్టుకోవటానికివి తోడ్పడతాయి.
మానసిక ఒత్తిడి మెదడుకు చిత్తు చేస్తుంది. కాబట్టి యోగా, ధ్యానం, ప్రాణాయామం, ప్రకృతితో గడపడటం వంటి వాటితో ప్రశాంతతను అలవరచుకోవాలి.

**సన్నిహిత సంబంధాలు**

కుటుంబ సభ్యులతో అన్యోన్యంగా ఉండాలి. వీలైనప్పుడల్లా స్నేహితులు, బంధువులతో కలవాలి. వారినైనా ఇంటికి ఆహ్వానించాలి. దీంతో సామాజిక సంబంధాలు బలపడతాయి. కుంగుబాటు, ఒత్తిడి సమస్యలు తగ్గుతాయి. ఇవి రెండూ మతిమరుపును తీవ్రం చేసేవే కావటం గమనార్హం. ఇతరులతో కలవకుండా, ఒంటరిగా ఉంటే ఆలోచనా నైపుణ్యాలు తగ్గటంతో పాటు అల్జీమర్స్ జబ్బు ముప్పూ పెరుగుతుంది. కాబట్టి సామాజిక, స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనటం మంచిది.

**కంటి నిండా నిద్ర**

రాత్రిపూట సామాజిక మాధ్యమాలు, ఓటీటీల పేరుతో నిద్రను బలి పెట్టొద్దు. కంటి నిండా నిద్రపోతేనే మెదడు పనితీరు, జ్ఞాపకశక్తి, అప్రమత్తత పుంజుకుంటాయి. ఇవి రోజువారీ పనులు హాయిగా చేసుకోవటానికి తోడ్పడతాయి. తగినంత విశ్రాంతి తీసుకోవటం వల్ల మానసిక ఒత్తిడి, కుంగుబాటూ తగ్గుతాయి. కాబట్టి రాత్రిపూట 7-9 గంటల సేపు నిద్రించేలా చూసుకోవాలి. గురక వంటి నిద్ర సమస్యలుంటే చికిత్స తీసుకోవాలి.

**ఆహారం సమతులంగా**

తినే ఆహారం మెదడుకూ శక్తినిస్తుంది. డిమెన్షియా లక్షణాల నివారణకు లేదా ఆలస్యం కావటానికి ఆరోగ్యకరమైన ఆహారం తోడ్పడుతున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి. ముఖ్యంగా తాజా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, గింజపప్పులు, నిండు గింజ ధాన్యాలు, చేపలు, చికెన్‌తో కూడిన ఆహార పద్ధతి ఎంతగానో మేలు చేస్తుంది. అయితే మాంసం, మిఠాయిలు, తీపి పానీయాలు, వెన్న, ఛీజ్ వంటి వాటి విషయంలో మితం పాటించాలని మరవరాదు.

**మద్యం విషయంలో జాగ్రత్త**

నాడీకణాలు ఒకదాంతో మరోటి సమాచారం ఇచ్చిపుచ్చుకునే తీరును మద్యం, మాదక ద్రవ్యాలు దెబ్బతీస్తాయి. ఇవి ప్రతిస్పందించే వేగం, ప్రణాళిక వేసుకోవటం, సమస్యల పరిష్కారం, భావోద్వేగ నియంత్రణ సామర్థ్యాలనూ తగ్గిస్తాయి. కాబట్టి మద్యం, మాదక ద్రవ్యాల జోలికి వెళ్లొద్దు. మద్యం అలవాటుంటే పరిమితం చేసుకోవాలి. మద్యం మితిమీరితే కింద పడి మెదడుకు దెబ్బలు తగిలే ప్రమాదమూ ఉంది. మెదడును దెబ్బతీసే అధిక రక్తపోటు, మధుమేహం వంటి జబ్బుల ముప్పూ పెరుగుతుంది.
డాక్టర్ల సలహా లేకుండా ఎలాంటి మందులను వేసుకోకూడదనీ గుర్తుంచుకోవాలి.

**సవాలే సవాల్**

వ్యాయామం శరీర సౌష్టవానికి తోడ్పడినట్టే మేధకు మేత పెట్టే పనులు మెదడును సజావుగా ఉంచుతాయి. పుస్తకాలు చదవటం, పజిల్స్ పూరించటం, కొత్త భాషలు నేర్చుకోవటం, సంగీత పరికరాలు వాయించటం వంటివి విషయగ్రహణ సామర్థ్యాలు పెరగటానికి, వాటిని కాపాడుకోవటానికి తోడ్పడతాయి. కాబట్టి కొత్త హాబీని అలవరచుకోవటం మంచిది.

**బాల్యం నుంచే..**

చాలామంది పెద్దగా పట్టించుకోరు గానీ బిడ్డ తల్లి కడుపులో ఉన్నప్పటి నుంచే మెదడు ఎదుగుదల మొదలవుతుంది. ఇది బాల్యమంతా కొనసాగుతూ వస్తుంటుంది. కాబట్టి గర్భిణులు మంచి పోషకాహారం తీసుకోవాలి. పుట్టిన తర్వాత శిశువులకు ఆటబొమ్మల వంటి వాటితో మెదడుకు ప్రేరణ కల్పించాలి. పెద్దగా అవుతున్నకొద్దీ ఆయా విషయాలను తెలుసుకునేలా అవకాశాలు కల్పించాలి. కథలు వినిపించటం, పుస్తకాలను పరిచయం చేయటం వంటివి మేలు చేస్తాయి. తోటి పిల్లలతో గడపటాన్ని ప్రోత్సహించాలి. కుటుంబ సభ్యులు, పెద్దవారితో గడపటం వల్ల సామాజిక నైపుణ్యాలు, భావోద్వేగ నియంత్రణ పట్టుబడతాయి. అలాగే రోజులో ఎక్కువసేపు ఆడుకునేలా చూడాలి. చిన్నప్పటి నుంచే వ్యాయామం చేయటం అలవాటు చేయాలి. దీంతో మెదడుకు రక్తసరఫరా పెరిగి, విషయగ్రహణ సామర్థ్యం ఇనుమడిస్తుంది. కంటి నిండా నిద్రపోయేలా చూసుకోవటమూ ముఖ్యమే. మెదడు ఎదుగుదల, జ్ఞాపకాలు కుదురుకోవటంలో ఇది చాలా కీలకం,

# ఫస్ట్ ఇన్నింగ్స్‌లో వెస్టిండీస్ ఆలౌట్.. స్కోర్ ఎంతంటే..?



**హైదరాబాద్ పెన్ పవర్:** పోర్ట్ ఆఫ్ స్పెయిన్: పాకిస్తాన్‌తో జరుగుతున్న రెండో టెస్ట్‌లో వెస్టిండీస్ మంచి స్కోరు చేసింది. జస్టిన్ గ్రీవ్స్ (73), రోస్టన్ ఛేజ్ (70) హాఫ్ సెంచరీలు సాధించడంతో.. 239/5 ఓవర్‌నైట్ స్కోరుతో సోమవారం రెండో రోజు ఆట కొనసాగించిన విండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 105.4 ఓవర్లలో 344 రన్స్‌కు ఆలౌటైంది. గ్రీవ్స్‌తో ఆరో వికెట్‌కు 96 రన్స్ జోడించిన ఛేజ్.. కీమర్ రోచ్ (19)తో ఏడో వికెట్‌కు 35 రన్స్ జత చేశాడు.

పాక్ బౌలర్ల ధాటికి లోయర్ ఆర్డర్ చేతులెత్తేసింది. షామేర్ జోసెఫ్ (8), జోమెల్ వారికన్ (5 నాటౌట్), జైడెన్ సీల్స్ (8) నిరాశపర్చారు. సాజిద్ ఖాన్ 4, మహ్మద్ అలీ, ఉబైద్ షా, అలీ ఉస్మాన్ తలా రెండు వికెట్లు తీశారు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ కడపటి వార్తలందేసరికి తొలి ఇన్నింగ్స్‌లో 7 ఓవర్లలో 30/0 స్కోరు చేసింది. అజాన్? (19 బ్యాటింగ్?), ఇమామ్? (10 బ్యాటింగ్?) క్రీజులో ఉన్నారు.

# టీమిండియాలో కలకలం.. కోచ్ గౌతం గంభీర్‌పై సీనియర్ల ఫిర్యాదు?

- హెడ్ కోచ్ గంభీర్ కోచింగ్ శైలిపై భారత సీనియర్ ఆటగాళ్ల అసంతృప్తి
- కొందరు బీసీసీఐ సభ్యులకు, మాజీ క్రికెటర్లకు అనధికారికంగా ఫిర్యాదు
- ఓటమికి బాధ్యత వహించకుండా ఇతరులను నిందించడమే కారణమని ఆరోపణలు
- అసంతృప్తి ఉన్నప్పటికీ గంభీర్‌కు అండగా నిలుస్తున్న బీసీసీఐ
- కోచ్ గా గంభీర్ భవిష్యత్తుకు కీలకం కానున్న శ్రీలంక టెస్ట్ సిరీస్



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ జట్టు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ కోచింగ్ శైలిపై జట్టులోని కొందరు సీనియర్ ఆటగాళ్లు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. రాహుల్ ద్రవిడ్ తర్వాత కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన గంభీర్ పద్ధతులపై తమకున్న అభ్యంతరాలను కొందరు సీనియర్లు... మాజీ క్రికెటర్లతో పాటు బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్‌లోని సభ్యులకు అనధికారికంగా తెలియజేసినట్లు సమాచారం. ఈ పరిణామంతో గంభీర్‌పై ఒత్తిడి పెరుగుతోంది. జట్టు ఓటమికి గంభీర్ బాధ్యత స్వీకరించడానికి ఇష్టపడటం లేదని, ఓటమి భారాన్ని ఆటగాళ్లు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ లేదా సహాయక సిబ్బందిపై నెట్టేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని ఓ నివేదిక పేర్కొంది. ఓటమికి కారణం యాజమాన్య నిర్ణయాలు కాదన్నట్లుగా అతను వ్యవహరిస్తున్నాడని, ఈ భావనే ఆటగాళ్లలో అసంతృప్తికి కారణమవుతోందని తెలుస్తోంది. ఈ వ్యవహారం డ్రెస్సింగ్ రూమ్‌లోనూ చర్చనీయాంశంగా మారినట్లు సమాచారం. ఈ పరిణామాలపై బోర్డు అధికారులు కూడా ఆందోళన చెందుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే, ఈ అనధికారిక ఫిర్యాదులు, ఆరోపణలు ఎలా ఉన్నప్పటికీ గౌతమ్ గంభీర్‌పై బీసీసీఐ పూర్తి విశ్వాసంతో ఉన్నట్లు స్పష్టమవుతోంది. జట్టులో ఇప్పటికీ అతడే కీలక అధికారిగా, సర్వాధికారాలు కలిగిన వ్యక్తిగా కొనసాగుతున్నారని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఇటీవల ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలలో వైట్-బాల్ సిరీస్‌లలో ఓటములు, స్వదేశంలో న్యూజిలాండ్‌తో టెస్టుల్లో వైట్‌వాష్, దక్షిణాఫ్రికాతో సిరీస్ ఓటమి వంటి ఫలితాల నేపథ్యంలో గంభీర్ కోచింగ్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా శ్రీలంకతో జరగబోయే రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ గంభీర్, అతని కోచింగ్ బృందానికి అత్యంత కీలకంగా మారింది. పలువురు కీలక ఆటగాళ్లు గాయాల కారణంగా ఈ సిరీస్‌కు అందుబాటులో లేకపోవడం వారికి అదనపు సవాల్‌గా మారింది. ప్రస్తుతానికి ఈ చర్చలన్నీ అనధికారిక స్థాయిలోనే ఉన్నాయని, గంభీర్‌కు బోర్డు మద్దతు కొనసాగుతుందని స్పష్టమవుతోంది. పాక్ బౌలర్ల ధాటికి లోయర్ ఆర్డర్ చేతులెత్తేసింది.

షామేర్ జోసెఫ్ (8), జోమెల్ వారికన్ (5 నాటౌట్), జైడెన్ సీల్స్ (8) నిరాశపర్చారు. సాజిద్ ఖాన్ 4, మహ్మద్ అలీ, ఉబైద్ షా, అలీ ఉస్మాన్ తలా రెండు వికెట్లు తీశారు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ కడపటి వార్తలందేసరికి తొలి ఇన్నింగ్స్‌లో 7 ఓవర్లలో 30/0 స్కోరు చేసింది. అజాన్? (19 బ్యాటింగ్?), ఇమామ్? (10 బ్యాటింగ్?) క్రీజులో ఉన్నారు.

# టీమిండియాలో షమీకి దారులు మూసుకున్నట్టేనా?.. సెలక్టర్ల సందేశం ఇదే!

- గాయపడిన బుమ్రా స్థానంలో యువ పేసర్ ఆకిబ్ నబీకి అవకాశం
- మరోసారి సీనియర్ పేసర్ మహమ్మద్ షమీకి దక్కని చోటు
- దేశవాళీలో అద్భుత ప్రదర్శన చేసినా సెలక్టర్ల మొండిచెయ్యి
- షమీకి టెస్ట్ ఫిట్‌నెస్ లేదన్న చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్
- యువ ఆటగాళ్ల ప్రదర్శనే కొలమానంగా మారుతోందన్న స్పష్టమైన సంకేతం



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా తరచూ గాయాల బారిన పడటం జట్టు యాజమాన్యానికి పెద్ద తలనొప్పిగా మారింది. తాజాగా ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్ ఆడినప్పటికీ, శ్రీలంకతో జరగబోయే టెస్ట్ సిరీస్‌కు బుమ్రా మరోసారి గాయంతో దూరమయ్యాడు. అతని స్థానంలో జమ్మూ కశ్మీర్ యువ పేసర్ ఆకిబ్ నబీకి బీసీసీఐ అవకాశం కల్పించింది. దేశవాళీ క్రికెట్‌లో అద్భుతంగా రాణించిన నబీకి చోటు దక్కడంపై హర్షం వ్యక్తమవుతున్నప్పటికీ, ఈ నిర్ణయం సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ కెరీర్‌పై తీవ్రమైన ప్రశ్నలను రేకెత్తిస్తోంది. గత కొంతకాలంగా షమీ టీమిండియాకు దూరంగా ఉంటున్నాడు. అతను 2023 నుంచి టెస్టులకు, గత ఏడాది నుంచి వన్డేలకు, 2025 నుంచి టీ20లకు ఎంపిక కాలేదు. తొలుత ఫిట్‌నెస్ సమస్యలతో పక్కనపెట్టినా, గత ఏడాదిగా దేశవాళీ క్రికెట్‌లో నిలకడగా రాణిస్తున్నప్పటికీ జాతీయ జట్టులోకి అతనికి పిలుపు అందడం లేదు. షమీ పునరాగమనంపై బీసీసీఐ చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్‌ను ప్రశ్నించగా, టెస్ట్ క్రికెట్‌కు అవసరమైన ఫిట్‌నెస్ అతనికి లేదని స్పష్టం చేశాడు. అయితే, వాస్తవ గణాంకాలు మరోలా ఉన్నాయి. షమీ తన చివరి ఏడు రంజీ ట్రోఫీ మ్యాచ్‌లలో ఏకంగా 1383 బంతులు వేసి, 16.72 సగటుతో 37 వికెట్లు పడగొట్టాడు. ఇందులో మూడుసార్లు ఐదు వికెట్ల ప్రదర్శన, కెరీర్ బెస్ట్ గణాంకాలు (8/90) కూడా ఉన్నాయి. ఇంత శ్రమించినా ఫిట్‌నెస్ లేదనడం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు శ్రీలంకతో సిరీస్‌కు ఎంపికైన ఆకిబ్ నబీ రంజీ సీజన్‌లో అద్భుతంగా రాణించాడు. కేవలం 12.56 సగటుతో 60 వికెట్లు తీసి అందరి దృష్టిని ఆకర్షించాడు. అతని ప్రదర్శనకు గుర్తింపు లభించింది. ఈ ఎంపికతో అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ షమీకి, ఇతర సీనియర్ ఆటగాళ్లకు ఒక స్పష్టమైన సందేశం పంపినట్లు కనిపిస్తోంది. కేవలం దేశవాళీలో రాణిస్తే సరిపోదు, జాతీయ జట్టులో చోటు కోసం పోటీ పడుతున్న యువ ఆటగాళ్ల కంటే అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి, పూర్తి ఫిట్‌నెస్‌ను నిరూపించుకోవాల్సిందే. ఇకపై యువ ఆటగాళ్లు కేవలం జట్టును నింపడానికి కాకుండా, వారి ప్రదర్శన ఆధారంగా నేరుగా తుది జట్టులో స్థానం కోసం పోటీ పడుతున్నారు. ఈ నేపథ్యంలో షమీ తిరిగి జట్టులోకి రావడం మరింత కష్టతరం కానుంది.

# పియానో వాయిస్తూ.. బుట్టబొమ్మలోని కొత్త కోణం

తెలుగు లోగిళ్లకు -బుట్టబొమ్మ-గా సుపరిచితమైన స్టార్ హీరోయిన్ పూజా హెగ్డే ఇటీవల తనలోని సరికొత్త కళాత్మక కోణాన్ని ఆవిష్కరించి అభిమానులను ఆశ్చర్యపరిచారు. నిరంతరం సినిమాలు, గ్లామరస్ ఫోటోషూట్‌లతో బిజీగా ఉండే ఈ భామ.. తాజాగా తన ఇన్‌స్టా ఖాతాలో పోస్ట్ చేసిన ఒక క్యూట్ అండ్ స్పెషల్ వీడియో నెట్టింట విపరీతంగా వైరల్‌గా మారింది. కేవలం నటనలోనే కాకుండా సంగీతంలోనూ తనకున్న ప్రతిభను చూపేందుకు పియానో వాయిద్య ప్రదర్శనతో పూజా నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటోంది. హాలీవుడ్‌లో ఆస్కార్ అవార్డులను కొల్లగొట్టిన పాపులర్ మ్యూజికల్ డ్రామా -లా లా ల్యాండ్-. ఈ చిత్రంలోని ఐకానిక్ మేలడీ ట్యూన్ -మియా అండ్ సెబాస్టియన్ థీమ్- ప్రతి ఒక్కరినీ మైమరిపిస్తుంది. గత కొద్దిరోజులుగా ఈ ధున్ తన మనసును బాగా వెంటాడుతోందని.. అందుకే స్వయంగా దీన్ని ఎలా ప్లే చేయాలో నేర్చుకుని.. కీబోర్డ్ - పియానోపై ప్లే చేశానని పూజా హెగ్డే వెల్లడించారు. ఎంతో ఏకాగ్రతతో, ఎంతో నైపుణ్యంతో ఆ నోట్స్ ప్లే చేస్తుంటే నెటిజన్లు ఫిదా అయిపోతున్నారు.

ఈ మ్యూజికల్ వీడియోకు పూజా హెగ్డే జోడించిన సరదా క్యాప్షన్ మరింత హంగామా సృష్టిస్తోంది. --గత కొన్ని రోజులుగా ఈ ట్యూన్ నన్ను వెంటాడుతోంది. ఎలాగైతేనేం దీన్ని ప్లే చేయడం నేర్చుకున్నాను. ఇక ఇప్పుడు హాలీవుడ్ స్టార్ హీరో ర్యాన్ గోస్లింగ్ ఇక్కడికి రావడమే ఆలస్యం!-- అంటూ చమత్కారంగా శీర్షిక రాసుకొచ్చారు. -లా లా ల్యాండ్- చిత్రంలో ర్యాన్ గోస్లింగ్ పియానో ప్లేయర్ పాత్రలో కనిపించిన సంగతి తెలిసిందే. ఆ చిత్రంలోని మూడ్‌కు అనుగుణంగా పూజా సరదా వ్యాఖ్య అభిమానులను ఎంతగానో అకట్టుకుంది. ఈ వీడియోలో పూజా హెగ్డే వాయించిన పియానో ట్యూన్‌తో పాటు తన లుక్ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సంప్రదాయబద్ధమైన చీరకట్టు- షార్ట్ హెయిర్ స్టైల్‌తో ఎంతో ప్రశాంతంగా, అందంగా కనిపిస్తూ నెటిజన్ల మనసులను దోచుకున్నారు. పూజాలోని సంప్రదాయం, ఆధునిక భావాలు కలగలిసి కనిపించడంతో ఈ వీడియోకు లక్షలాది లైక్స్ - వ్యూస్ లభిస్తున్నాయి. అభిమానులు ఈ రూపంలో పూజాను చూసి మురిసిపోతున్నారు. ప్రస్తుతం ఈ పోస్ట్‌పై ఫ్యాన్స్ సహా సినీ ప్రముఖులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. -లా లా ల్యాండ్- సినిమాలో నటి ఎమా స్టోన్ చేసిన మియా పాత్రలాగే మీరు ఎంతో అందంగా ఉన్నారు.. పూజా హెగ్డే కీబోర్డ్ ప్లే చేయడం.. మధ్యలో ఆమె చిందించిన చిరునవ్వు నిజంగా అద్భుతం! అంటూ నెటిజన్లు కామెంట్ల రూపంలో తమ అభిమానాన్ని చాటుకుంటున్నారు. ఒక కథానాయికగా గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా... ఇలాంటి విభిన్నమైన నైపుణ్యాలను బయటపెడుతూ బుట్టబొమ్మ అందరినీ ఆకట్టుకుంటోంది. పూజా నటించిన జననాయగన్ ఇటీవలే విడుదలైన సంగతి తెలిసిందే. తదుపరి వరుస చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది.



నేహా శెట్టి 'పల్ప్ ఫిక్షన్' తరహా శైలి: ఆకర్షణీయమైన లుక్ సినీ కెరీర్





ప్రకృతి పావని ఆధునిక సొబగులను నిర్వచించింది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965